నాలుగు రాష్ట్రాలతో చర్చలు

- 'పోలవరం'పై కేంద్రానికి సుప్రీం ఆదేశం
- ఫిబ్రవరి 15 కేసు విచారణ వాయిదా

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 127 | విజయవాడ, గురువారం 8 డిసెంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 8 December 2022 | Rs




సిటీ

విజయ సంకేతం చూపిస్తున్న కేజ్రీవాల్, సిసోడియా

జరిగేది యుద్ధమే ..!

ఇది నా మాటగా ప్రతి ఇంట్లో చెప్పండి

జయహో బిసి మహాసభలో సిఎం జగన్



విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం జరిగిన 'జయహో బిసి' సభలో అభివాదం చేస్తున్న జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'మరో 18 నెలల్లో రాష్ట్రంలో యుద్ధం జరగబోతోంది. ఇది మంచికి చెడుకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది నా మాటగా ప్రతి ఇంట్లో చెప్పండి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జయహోబిసి మహాసభ లో ఆయన మాట్లాడుతూ పేదల భవిష్యత్తుకు, పేదలు పేదలుగానే మిగిలిపోవాలని తాపత్రయ పడే వారికి మధ్యన యుద్ధం జరగనుందని అన్నారు. ఆ యుద్ధంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ నిరుపేదలు ఒకవైపు ఉంటారని, మరోవైపు బిసిల తోకల కత్తిరిస్తాను, దళితుల కులాల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అంటూ దుర్మార్గంగా మాట్లాడే వ్యక్తులు ఉంటారని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయంలో బిసిలకు ఉత్తమాటలకు పరిమితం కాకుండా బిసిలకు రాజ్యాధికారం పంచామని అన్నారు. ఈ విషయాన్ని ప్రతి 50 ఇళ్లకు ఒక కార్యకర్త వెళ్లి చెప్పాలన్నారు. 2024లో ఎన్నికల్లోనూ గెలుపు మనదేనని గడపగడపకూ వెళ్లి చాటిచెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం రికార్డుస్థాయిలో రూ 3.18 లక్షల కోట్లు ఖర్చు చేస్తే అందులో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు 80 శాతం అందించామని తెలిపారు. బిసిల అభివృద్ధికి రూ 1.65 లక్షల కోట్లు ఖర్చుచేశామని అన్నారు. తమ ప్రభుత్వం బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజలందరి సంక్షేమం కోసం ఖర్చు చేస్తే తెలుగుదేశం హాయంలో నలుగురైదుగురు మాత్రమే దోచుకునేవారని అన్నారు. చంద్రబాబునాయుడు ఏడాదికి రూ 10 వేల కోట్లతో బిసి సబ్‌ప్లాన్ అమలు చేస్తామని ఐదేళ్ల కాలంలో బిసిల కోసం రూ 20 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. ఇస్త్రీపెట్టెలు, షేవింగ్ కిట్లు ఇవ్వడమే బిసిల అభివృద్ధిగా టిడిపి చిత్రీకరించిందని చెప్పారు. 2014 ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు 114 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ పూర్తి చేయలేదని అన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రాణించాలని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని అన్నారు.

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అహంకారంతో బిసిల తోకలు కత్తిరిస్తాను అంటే 2019 ఎన్నికల్లో బిసిల సత్తాఏమిటో చూపామని అన్నారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రకటించిన జగన్ అన్ని పథకాలను అందించారని అన్నారు. రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిలు 85 వేల మంది ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ పదవుల్లో వున్నారంటే కారణం జగన్‌మోహన్‌రెడ్డేనని అన్నారు. బిసి సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బిసిలకు ఏనాడూ ప్రాధాన్యతను ఇవ్వలేదని అన్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, . వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తదితరులు ప్రసంగించారు. వైసిపి బిసి సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి ఈ సభకు అధ్యక్షత వహించారు.

భారీగా ట్రాఫిక్ జామ్

జయహో బిసి మహాసభ కారణంగా బుధవారం విజయవాడలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. దీంతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జాతీయరహదారిపై సాయంత్రం ఏడు గంటలప్పుడు కూడా వాహనాలు బారులు తీరి కనిపించాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ఆర్‌టిసి బస్సులను ఈ సభకోసం వినియోగించడంతో అక్కడ సాధారణ ప్రయాణీకులు బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు.

ఢిల్లీ మున్సిపోల్స్‌లో

బిజెపిని ఊడ్చేశారు

- ఎంసిడి ఎన్నికల్లో ఆమాద్మీ పాగా


న్యూఢిల్లీ : పదిహేనేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపికి ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఓటర్లు గుణపాఠం చెప్పారు. ఆమాద్మీ పార్టీకి విజయాన్ని కట్టబెట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీలోని 250 వార్డుల్లో 134 స్థానాల్లో కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ అభ్యర్థులు విజయం సాధించారు. 2017లో 270 వార్డులకు ఎన్నికలు జరగ్గా, బిజెపికి 181, ఆప్‌కు 48, కాంగ్రెస్‌కు 27 స్థానాలు లభించాయి. తాజా ఎన్నికల్లో 48 వార్డుల నుంచి 134 వార్డులకు ఆప్ గ్రాఫ్ పెరగ్గా, 181 వార్డుల నుంచి 104 వార్డులకు బిజెపి సీట్లు పడిపోయాయి. 2012 ఎన్నికల్లో 77, 2017 ఎన్నికల్లో 27 స్థానాలు గెలిచిన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో తొమ్మిది వార్డులకే పరిమితమైంది. మరో మూడు చోట్ల స్వతంత్రులు గెలుపొందారు. చాందిని మహల్ స్థానంలో ఆప్ అభ్యర్థి అలీ మహ్మద్ ఇక్బాల్ 17,134 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందగా, చిత్తరంజన్ పార్క్ వార్డులో ఆప్ అభ్యర్థి ఆశు ఠాకూర్ 44 ఓట్ల అతి తక్కువ మెజారిటీతో గెలుపొందారు. ఈ నెల 4న ఎన్నికలు జరగ్గా, 1349 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 50.48 శాతం ఓటింగ్ నమోదైంది. బుధవారం ఉదయం ఏడు గంటలకు భారీ భద్రత మధ్య నగరవ్యాప్తంగా 42 కేంద్రాల్లో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. 1958లో ఏర్పాటైన మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసిడి)ని 2012లో అప్పటి ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ హయాంలో మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేశారు. తిరిగి వాటిని ఈ ఏడాది మే 22న విలీనం చేసి ఎంసిడిగా పునరుద్ధరించారు.

ఢిల్లీ ప్రజలు బిజెపికి గుణపాఠం చెప్పారు. 2021లో ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు విద్వేష వ్యాఖ్యలు చేయడం, మతకలహాలను ప్రేరేపించడం అందరికీ తెలిసిందే. ఇటీవల ముస్లిములకు చెందిన దుకాణాలను బుల్డోజర్లతో కూల్చివేయడంతోపాటు మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే ఇటువంటి రాజకీయాలకు కార్పొరేషన్ వాసులు బుద్ధి చెప్పారు.

మోడీ ఆశీర్వాదం కావాలి : కేజ్రీవాల్

ఆప్ గెలుపుతో కార్యకర్తలు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఢిల్లీ నగర పరిస్థితి మరింత మెరుగుపరిచేందుకు కాంగ్రెస్, బిజెపిలతోపాటు కేంద్రప్రభుత్వం, మోడీ ఆశీర్వాదం కావాలని అన్నారు. పరిశుభ్రమైన నగరంగా ఢిల్లీని తీర్చిదిద్దేందుకు రాజకీయ పార్టీలన్నీ కలిసి రావాలని కోరారు.

అంతకుముందు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపిని ప్రజలు ఓడించారని, నిజాయితీగా పనిచేసే ఆప్‌ను గెలిపించారని అన్నారు. '17 మంది కేంద్ర మంత్రులు, వంద మంది ఎంపీలు, ఇడి, సిబిఐ, ఐటిలతోపాటు జైల్లో ఉన్న ఓ వ్యక్తి కూడా ఎన్నికల్లో వారి ముఖ్య ప్రచార కర్తలు. అయినప్పటికీ సామాన్యుడి చేతిలో ఓడిపోయారని' ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా చెప్పారు.



పెళ్లి బృందానికి ప్రమాదం

- ట్రాక్టర్ బోల్తా పడి ఆరుగురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు

లోపలి పేజీలో..

ధరాఘాతంపై ఉమ్మడి పట్టు

- 12 ప్రతిపక్షాల భేటీలో నిర్ణయం
- బిల్లులపై సమగ్ర పరిశీలన అవసరం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ధరల పెరుగుదలపై కేంద్రప్రభుత్వాన్ని ఐక్యంగా నిలదీయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. పార్లమెంట్ సమావేశాల్లో వ్యవహరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ప్రతిపక్షాలు భేటీ అయ్యాయి. బుధవారం నాడిక్కడ పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో ప్రతిపక్షనేతలు సమావేశం అయ్యారు. పార్లమెంట్ ప్రారంభమవ్వడానికి ముందు ఈ సమావేశంలో ధరల పెరుగుదలపై ప్రతిపక్షాలన్ని ఉమ్మడిగా నిలదీయాలని నిర్ణయించాయి. నిరుద్యోగం, రాజ్యాంగ సంస్థలపై దాడి వంటి ఇతర అంశాలను ఉమ్మడిగా లేవనెత్తాలని నిర్ణయించాయి.

అనంతరం ఖర్గే మాట్లాడుతూ పార్లమెంటు ప్రజాస్వామ్య చర్చలకు నిలయమని పేర్కొన్నారు. భావసారూప్యత గల పార్టీలు ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలను గట్టిగా లేవనెత్తుతామని అన్నారు. ప్రజా సమస్యలను లేవనెత్తేందుకు ప్రతిపక్షాలకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. హడావుడిగా చట్టాలు రూపొందించినట్లయితే, అవి న్యాయపరమైన పరిశీలనను వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. కాబట్టి, అన్ని ముఖ్యమైన బిల్లులను జాయింట్, సెలెక్ట్ కమిటీలకు పంపాలని ఆశిస్తున్నామని, తద్వారా అవి సమగ్రంగా పరిశీలించబడతాయని చెప్పారు. పార్లమెంటరీ ప్రక్రియలు, చర్చలలో పూర్తి సహకారం అందించడానికి ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

సమావేశంలో కె.సురేష్, గౌరవ్ గొగోయ్ (కాంగ్రెస్), ఎలమరం కరీం (సిపిఎం), టిఆర్ బాలు (డిఎంకె), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), సుదీప్ బందోపాధ్యాయ (టిఎంసి), సంజయ్ సింగ్ (ఆప్), వందనా చౌహాన్, ఫౌజియా ఖాన్ (ఎన్‌సిపి), వైకో (ఎండిఎంకె), ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ (ఆర్‌ఎస్‌పి), ఐయుఎంఎల్, శివసేన (థాకరే), ఆర్‌ఎల్‌డి పార్టీల ఎంపిలు పాల్గొన్నారు.

చర్చలు సజావుగా సాగేందుకు సహకరించాలి : ప్రధాని

పార్లమెంట్‌లో చర్చలు సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రతిపక్ష పార్టీలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కోరారు. ఈమేరకు బుధవారం నాడిక్కడ పార్లమెంట్ ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని, ఈ చర్చలు సానుకూలంగా, ఫలప్రదంగా జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త ఎంపిలు, యువ పార్లమెంట్ సభ్యులకు చర్చల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని అన్ని రాజకీయ పార్టీల నేతలను కోరారు. ప్రజాస్వామ్య దేశంలో మరో తరాన్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. జి-20 అధ్యక్ష బాధ్యతలు భారత్ చేపట్టిన వేళ, అంతర్జాతీయ సమావేశంలో ఘనమైన చోటు దక్కించుకుంటోందని చెప్పారు.

ప్రతిపక్షాలకూ సమాన అవకాశం

- రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖర్‌కు ప్రతిపక్షాల వినతి
- లోక్‌సభలో కృష్ణకు నివాళి

లోపలి పేజీలో..

నేడు గుజరాత్, హిమాచల్ ఫలితాలు వెల్లడి

'అవుట్ సోర్సింగ్' తొలగింపు నిర్ణయాన్ని

ఉపసంహరించుకోండి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటన మోసపూరితమని రుజువైందని పేర్కొన్నారు. 'ముఖ్యమంత్రి ఆగ్రహించారు. ఎవరినీ తొలగించబోం' అంటూ సజ్జల భరోసా ఇచ్చిన మరుక్షణమే ఆ నిర్ణయం తాత్కాలికమైనదేనంటూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం తక్షణం ఆ ఆదేశాలను ఉపసంహరించుకుని అందరినీ రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం విధానాన్ని అమలు చేస్తామని 2019 ఎన్నికల్లో వాగ్దానం చేసిన వైసిపి ఇప్పుడు యూటర్న్ తీసుకుందని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు వేయాలనుకోవడం దారుణమని పేర్కొన్నారు. పదేళ్ల లోపు సర్వీస్ గల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని నవంబర్ 28న విడుదల చేసిన సర్క్యులర్ వ్యవహారం ఈ నెల 4న మీడియా బయటపెట్టిందని తెలిపారు. ఉద్యోగుల్లో వ్యతిరేకత రావడంతో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల 'అది కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల జరిగిందని, ముఖ్యమంత్రి ఆగ్రహించారని, ఎవరి ఉద్యోగాలు తొలగించబోమని 5న మీడియాకు వివరణ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.

ఆరవ తేదిన జరిగిన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల సమావేశంలోనూ ఇదే విషయాన్ని నమ్మబలికారని పేర్కొన్నారు. బయటకు ఇలా చెబుతూనే 5వ తేదీన డైరెక్టరేట్ ఆఫ్ అకౌంట్స్ శాఖ నుంచి పాత ఉత్తర్వులను కొంతకాలం నిలిపివేస్తున్నామని ఆదేశాలు ఇవ్వడం ద్వారా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మెడపై కత్తి వేలాడదీశారని పేర్కొన్నారు. ఇటువంటి కక్షపూరిత విధానాన్ని ప్రభుత్వం విడనాడాలని, ఎన్నికల హామీ మేరకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

'పదేళ్ల లోపు' వారిని గుర్తించండి

- శాఖలకు ప్రభుత్వ ఆదేశాలు

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగింపు విషయంలో ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతన లేని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా పదేళ్లలోపు సర్వీసు ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను గుర్తించాలంటూ తాజాగా ఆదేశాలు జారీ అయ్యాయి. సాధ్యమైనంత త్వరగా ఈ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి శాఖల వారీగా ఉన్న సిబ్బంది సంఖ్య, వారి సర్వీసు వివరాలను అప్కాస్ ఎండికి పంపాలన్నది ఈ ఆదేశాల సారాంశం. ప్రభుత్వం నుండి అందిన ఆదేశాలతో హెచ్‌ఓడిలు ఈ మేరకు చర్యలు చేపట్టారు. కొందరు రాతపూర్వకంగా దిగువకు ఆదేశాలు ఇవ్వగా, మరికొందరు హెచ్‌ఓడిలు మౌఖిక ఆదేశాలకు దిగువకు ఇచ్చారు. ఈ విషయం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రుణం మరింత భారం

- ఐదో సారి ఆర్‌బిఐ 'వడ్డీ'ంపు
- రెపోరేటు మరో 0.30% పెంపు



ముంబయి : రుణ గ్రహీతలపై మరింత భారం పడనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వరుసగా ఐదో సారి వడ్డీ రేట్లను పెంచేసింది. మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ ద్వైమాసిక మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) భేటీలో రెపో రేటును మరో 35 బేసిస్ పాయింట్లు పెంచి 6.25 శాతానికి చేర్చింది. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన సాగిన ఈ భేటీలో భారత వృద్ధి రేటు అంచనాలకూ కూడా కోత పెట్టింది. కీలక వడ్డీ రేట్లను మరోమారు పెంచడం ద్వారా ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 225 బేసిస్ పాయింట్లు (2.25 శాతం) పెంచినట్లయ్యింది. తాజా పెంపుతో రెపో రేటు 2018 ఆగస్టు నాటి స్థాయికి చేరింది. ప్రపంచ వ్యాప్తంగా అస్థిర పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం మెరుగ్గానే ఉందని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ద్రవ్యోల్బణ కట్టడి లక్ష్యంగా కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్లను పెంచిందన్నారు.



శ్రమజీవుల పక్షాన ప్రజానాట్యమండలి కళా ప్రదర్శన .. వార్త లోపలి పేజీలో

నేటి నుంచి వ్యకాస రాష్ట్ర మహాసభ

- హాజరు కానున్న బృందాకరత్, వ్యకాస జాతీయ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలిరోజు గురువారం జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డు నుంచి ప్రధాన వీధుల గుండా బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో ముఖ్యవక్తగా గిరిజనోద్యమ నేత బృందాకరత్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయరాఘవన్, బి.వెంకట్, కేరళ ఎంపి శివదాసన్, రైతు సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొనున్నారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు దండమూడి కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. ఈ సభకు 350 మంది ప్రతినిధులు, 50 మంది ఆహ్వానితులు మొత్తం 400 మంది హాజరుకానున్నారు. రాష్ట్ర మహాసభ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం ప్రాంతమంతా ఎరుపుమయమైంది. ఇప్పటికే ఫొటో ఎగ్జిబిషన్, వైద్యశిబిరం, విద్యార్థులకు పోటీలతోపాటు బుధవారం రాత్రి నిర్వహించిన ఆటపాట కార్యక్రమంతో సందడి నెలకొంది. భూమి, కూలి, ఉపాధి, సామాజిక అంశాలపై సాగిన ఉద్యమాలు మరింత ఉధృతం చేసేందుకు ఈ మహాసభ దోహద పడుతుందని మహాసభ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రవి తెలిపారు.

మూడు రోజుల పాటు భారీ వర్షాలు

- నేడు తీరాన్ని తాకే అవకాశం
- తమిళనాడు, దక్షిణకోస్తాకు హెచ్చరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బంగాళఖాతంలో ఏర్పడ్డ మాండూస్ గురువారం నాడు తుపానుగా మారి తీరాన్ని తాకనుంది. దీని ప్రభావంతో మూడు రోజుల పాటు తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా ప్రాంతాల్లో భారీ వర్షాలు పడనున్నాయి. 80 నుండి 90 కిలోమీటర్ల వేగంగా గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. పులికాట్ సరస్సులోకి ఎవరూ వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. బుధవారం ఉదయానికి కరైకల్‌కు 670 కిలోమీటర్ల దూరంలోనూ, చెన్నైకి 750 కిలోమీటర్ల దూరంలో అల్పపీడనం కేంద్రీకృతమైందని, ఈశాన్య దిశగా కదులుతూ గురువారం దక్షిణ కోస్తాకు అనుకుని ఉత్తర తమిళనాడు తీరాన్ని మహాబలిపురం సమీపంలో తాకుతుందని పేర్కొంది. ఈ నెల 9న తీరాన్ని దాటి క్రమంగా బలహీనపడుతూ రాష్ట్రంలోని చిత్తూరు వైపు వెళుతుందని తెలిపింది. తీవ్రగాలుల నేపథ్యంలో చెట్లు కూలి, విద్యుత్ వ్యవస్థకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

'ఉక్కు' ప్రైవేటీకరణ ఎంతవరకు వచ్చింది?

- కలెక్టర్‌ను ఆరా తీసిన కేంద్రం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ముమ్మరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోంది. బిజెపి మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు, స్టీల్ ప్లాంట్ కార్మికులు, రాష్ట్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తోన్నా ముందుకే సాగాలని చూస్తోంది. ఇంతవరకూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో సంప్రదింపులు చేస్తూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు విశాఖ జిల్లా కలెక్టర్ నుంచి కూడా వివరాలు సేకరిస్తోంది. 'విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటీకరణ చర్యల అమలు తీరు ఎలా ఉంది? ప్రస్తుతం ఏం జరుగుతోంది? స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటీకరణకు మేనేజ్‌మెంట్ ఎలాంటి చర్యలు అమలు చేస్తోంది?' అనే వివరాలపై కేంద్ర ఉక్కు పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆరా తీస్తోంది. ఈ వివరాలు పంపాలంటూ విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌కు ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎ.రామలింగేశ్వరరాజును ఈ వివరాలు సేకరించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన స్టీల్‌ప్లాంట్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌తో భేటీ అయ్యారు. 'ఏం జరుగుతోంది? ఏమీ లేదు? ఏం చెప్పాలి? ప్రైవేటీకరణ ఇంకా ప్రారంభం కాలేదు' అని సిఎమ్‌డి అతుల్ భట్ సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ప్రైవేటీకరణ వ్యవహారాన్ని కేంద్ర మంత్రిత్వ శాఖ నేరుగా చూస్తోన్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం తర్జనభర్జనలో పడుతోంది. ఏ సమాధానమిస్తే ఏం జరుగుతుందో అనే ఆందోళనతో నివేదికను ఇంకా పంపలేదు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ద్వారా కాకుండా కేంద్ర ఉక్కు, పరిశ్రమల మంత్రిత్వ శాఖ నేరుగా కలెక్టర్‌ను సంప్రదించడంతో జిల్లా అధికార యంత్రాంగం గగుర్పాటుకు గురైంది.

కార్మిక వర్గం అలుపెరుగని పోరాటం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 664 రోజులుగా విశాఖ కార్మిక వర్గం పోరాడుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ గత ఆర్థిక సంవత్సరం రూ.28,500 కోట్లకుపైగా టర్నోవర్‌తో రూ.950 కోట్ల నికర లాభం ఆర్జించింది. ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆందోళనలను ఉధృతం చేయాలని తాజాగా నిర్ణయించింది. పోరాటాన్ని ప్రారంభించి ఈ నెల 27తో రెండేళ్లు కావస్తోంది. ఈ సందర్భంగా ఈ నెల పది మానవ హక్కుల దినోత్సవం రోజున భారీ సదస్సు నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించింది.

ఎమ్మెల్యే సంజీవయ్య కుమార్తె వివాహానికి సిఎం హాజరు



నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన వివాహ వేడుకకు ముఖ్యమంత్రి హాజరై నూతన వధువరులు శ్రావణ్, సౌజన్యలను ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సిఎం వెంట డిప్యూటీ సిఎం నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు జడ్‌పి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఉన్నారు.



వైభవంగా అమీన్‌పీర్ దర్గాలో గంధోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కడప అమీన్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం రాత్రి గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేనీ ఇంటి నుండి గంధం తీసుకుని మేళతాళాలతో హజరత్ సూఫీ సర్ మస్తాని చిల్లాష్‌భాషా సయ్యద్‌షా ఆరిఫుల్లా మహమ్మద్ మొహమ్మదుల్ చిష్టియుల్ ఖాదరి స్వామి వారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గంధం సమర్పించి భక్తులకు గంధాన్ని పంపిణీ చేశారు. రాత్రి 10 గంటలకు ముషాయిరా హాల్లో ఖావ్వలి కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఉదయం 10 గంటలకు దర్గా నుంచి మాలంగ్ షా మేరవణిగా కడప నగరాబాహిరపేటలోని బాదులా షా మాఖానీకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తిరిగి దర్గాకు చేరుకున్నారు.

దర్గాను దర్శించుకున్న సినీ నటులు

అమీన్‌పీర్ దర్గాను సినీనటులు దర్శించుకున్నారు. సీనియర్ నటుడు పృథ్వీరాజ్, ఎపి04 రామాపురం సినిమా హీరో రామ్ జక్కల, హీరోయిన్ అఖిల ఆకర్షణ, డైరెక్టర్ హేమారెడ్డి, అడిషనల్ డిఓపి వినయ్ కుమార్, ప్రొడక్షన్ మేనేజర్ శివ కుమార్ హనుమంతు, యాక్టర్ సునీల్ మల్లెం, బృందం సభ్యులకు దర్గా సంప్రదాయ ప్రకారం ముజవర్లు ఘనంగా స్వాగతం పలికారు.

వైద్యులకు జీతాల బకాయిలు చెల్లిస్తాం

హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

ప్రజాశక్తి, అమరావతి

కరోనా వైరస్ వ్యాప్తి వేళ వైద్య సేవలు అందించిన కాంట్రాక్ట్ వైద్యులకు జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. రూ.14 లక్షలను కడప జిల్లా డిఎంహెచ్‌ఓకు మంజూరు చేశామని, ఈ నెల 9వ తేదీలోగా అన్ని జిల్లాల్లోని వారికి జీతాలు చెల్లిస్తామని వైద్య ఆరోగ్య శాఖ చెప్పింది. జీతాలు జాప్యం చేసినందున వడ్డీ కోరే హక్కు కాంట్రాక్ట్ డాక్టర్లకు ఉంటుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వ హామీని అమలు చేసి అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం ప్రభుత్వాన్ని ఆదేశించారు. కాంట్రాక్ట్ వైద్యులు గీత్ సత్యసాయి స్వరూప్ సహా పది మంది దాఖలు చేసిన పిటిషన్ తరపు లాయర్ తాండవ యోగేష్ వాదిస్తూ, జీతాలు చెల్లించడం ఆలస్యం చేసినందుకు వడ్డీ కూడా ప్రభుత్వం ఇవ్వాలన్నారు. విచారణ 2 వారాలకు వాయిదా పడింది.

క్రికెట్ అసోసియేషన్ వ్యవహారం సింగిల్ జడ్జి దగ్గరే తేల్చుకోండి

అపెక్స్ ఎన్నికల ఫలితాలపై స్టేను సవాల్‌చేసిన కేసులో డివిజన్ బెంచ్

ప్రజాశక్తి, అమరావతి

ఏపీ క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అపెక్స్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలను నిలిపివేయాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి డివిజన్ బెంచ్ నిరాకరించింది. సింగిల్ జడ్జి స్టే ఆదేశాలను రద్దు చేయాలని ఏసీఏ కార్యవర్గం చేసిన వినతిని తోసిపుచ్చింది. ఈ కేసు ఈ నెల 14న సింగిల్ జడ్జి విచారణ చేస్తారని, ఈ వ్యవహారాన్ని సింగిల్ జడ్జి వద్దనే తేల్చుకోవాలని చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. ఏసీఏ అధ్యక్షుడు పి.శరత్‌చంద్రారెడ్డిపై ఈడీ కేసు ఉన్నందున ఆ పదవిని నిర్వహించేందుకు అర్హుడు కాదంటూ చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్ వేసిన కేసులో సింగిల్ జడ్జి, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ ఎన్నిక ఫలితాలను వెల్లడించవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని రద్దు చేయాలని ప్రస్తుత కార్యవర్గం దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌లో ఉత్తర్వులు జారీకి డివిజన్ బెంచ్ నిరాకరించింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజల మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పే క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపవలసిన చిరునామా: స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సిఎం, విజయసాయిపై పరువు నష్టం దావా వేస్తా : లోకేష్

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

తనపైనా, తెలుగుదేశంపార్టీ అధినేతపైనా ఆరోపణలు చేసి పారిపోవడం సిఎం జగన్మోహన్‌రెడ్డి, ఎంపి విజయసాయిరెడ్డికి అలవాటుగా మారిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రులో బుధవారం నిర్వహించిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ నిత్యం అబద్ధాలు చెప్పి... అదే నిజమని జనాలు నమ్మించడంలో జగన్మోహన్‌రెడ్డి సిద్ధహస్తుడని విమర్శించారు. ఎన్నికలకు ముందు తనపై అనేక ఆరోపణలు చేశారని, అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అనేక ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. దమ్ముంటే తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ అంటూ ఆరోపణలు చేస్తున్న వైసిపి ప్రభుత్వం 24 గంటల్లో ఆధారాలు చూపాలని ఛాలెంజ్ చేస్తే పారిపోయిందని ఎద్దేవా చేశారు. పింక్ డైమండ్, దసపల్లా భూములు కొట్టేశానన్నారు, అగ్రిగోల్డ్ కుంభకోణం నేనే చేశానన్నారు, ఫైబర్ గ్రిడ్‌లోనూ ఆరోపణలు చేసిన జగన్‌రెడ్డి గ్యాంగ్ ఒక్క ఆరోపణ కూడా ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న జగన్, విజయసాయిపై పరువు నష్టం దావా వేయనున్నట్టు వెల్లడించారు.

'లాక్‌డౌన్' వేతనం మినహాయింపు

- లబోదిబోమంటున్న టిటిడి కల్యాణకట్ట క్షురకులు
- నెలంతా ఎలా బతకాలంటూ ఆవేదన

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

కల్యాణకట్టలో పీస్‌రేట్‌పై పనిచేస్తోన్న క్షురకులకు కరోనా లాక్‌డౌన్ సమయంలో ఇచ్చిన డబ్బుల రికవరీకి టిటిడి ఇప్పుడు చర్యలు చేపట్టింది. ఎటువంటి ముందస్తు సమాచారమూ ఇవ్వకుండా నవంబర్ వేతనం నుంచి రికవరీ ప్రారంభించింది. వచ్చేదే తక్కువ వేతనం, ఇందులో కట్ చేసి ఇస్తుండడంతో క్షురకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరోనా ముమ్మరంగా ఉన్న సమయంలో తిరుమలలో దర్శనాలను టిటిడి అప్పట్లో నిలుపుదల చేసింది. దీంతో, కల్యాణకట్టలో పీస్‌రేట్‌పై పనిచేస్తున్న క్షురకులకు ఉపాధి లేకుండా పోయింది. ఈ దృష్ట్యా అప్పట్లో వారికి నెలకు ఎనిమిది వేల రూపాయల చొప్పున ఎనిమిది నెలల పాటు ఇచ్చింది. ఇప్పుడు ఈ మొత్తాలను రికవరీ చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నవంబర్‌కు సంబంధించి డిసెంబర్‌లో ఇచ్చిన వేతనంలో కోత పెట్టింది. దీంతో, కొందరికి రూ.17, మరికొందరికి రూ.69, ఇంకొందరికి రూ.77 వేతనం మాత్రమే అందింది. రూ.105, రూ.250 కూడా అందిన వారు ఉన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో ఈ మొత్తంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కోతపై టిటిడి అధికారులను ప్రశ్నించగా, కరోనా కాలంలో ఇచ్చిన అడ్వాన్సుల కటింగ్ అని చెప్పడం గమనార్హం. మరో ఏడు నెలల పాటు ఈ విధంగానే మినహాయించుకోనున్నట్లు సమాచారం. తిరుమల శ్రీవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తులు తలనీలాలు సమర్పిస్తుంటారు. దీనివల్ల టిటిడికి ఏటా రూ.350 కోట్లు ఆదాయం సమకూరుతోంది. కల్యాణకట్టలో గత ఐదేళ్ల నుంచి పీస్‌రేట్‌పై 850 మంది క్షురకులు పనిచేస్తున్నారు. గుండుకు రూ.11, మూడు కత్తెరలకు రూ.4 చొప్పున టిటిడి వారికి చెల్లించాలి. రోజుకు 20 నుండి 30 గుండ్లు గీస్తారు. రోజుకు సగటున రూ.300 చొప్పున నెలకు రూ.9 వేలు ఆదాయం వస్తోంది. ఇచ్చే మొత్తం పెంచాలని, బస్సుపాసులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని దీర్ఘకాలికంగా వారు కోరుతున్నారు. బస్సుపాసులు ఇచ్చేది లేదని టిటిడి తేల్చి చెప్పింది. గుండుకు రూ.4 అదనంగా ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. పైగా 'కత్తెర' డబ్బులను ఎగ్గొడుతోందని క్షురకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిటిడి ఏర్పాటు చేసిన 'లక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ ఏజెన్సీ'లో చేరాలని ఒత్తిడి తెస్తూ విజిలెన్స్‌ను పురమాయించిందని అంటున్నారు. తాము 20 ఏళ్లుగా పనిచేస్తున్నామంటూ, ఏజెన్సీలో చేరితే తమ సీనియారిటీని కోల్పోతామంటూ క్షురకులు వ్యతిరేకిస్తున్నారు. తమపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా వేతనాల్లో టిటిడి కోత పెడుతోందని, దీన్ని ఆపాలని వారు కోరుతున్నారు.



రికవరీ ఆపాలి

క్షురకులకు గతంలో ఇచ్చిన మొత్తాన్ని రికవరీ చేయడం ఆపాలి. వందల కోట్ల రూపాయలను వివిధ సంస్థలకు విరాళంగా టిటిడి ఇస్తోంది. క్షురకుల పట్ల కూడా టిటిడి దాతృత్వం చూపాలి. వేతనం నుంచి కోతలు ఆపాలి. గతంలో ఇచ్చిన మొత్తాన్ని ఉచితంగా ఇచ్చినట్లు భావించి రద్దు చేయాలి. అందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలి.

-కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

631 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 631 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ చేపట్టినట్లు డిఎంఇ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల వారు ఈనెల 10వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఎపిఎంఎస్‌ఆర్‌బి వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన తెలిపారు.

మీడియాతో మాట్లాడితే చర్యలే

- పర్యాటక శాఖలో వివాదాస్పద నిర్ణయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

చెప్పిందే రాసుకోవాలి తప్ప మీరేమీ అడగొద్దు అంటున్న అధికారులు మరికొన్ని వివాదాస్పద నిర్ణయాలకు తెర లేపుతున్నారు. తాజాగా రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ బోర్డు సమావేశంలో ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నేతలు మీడియా వద్దకు వెళ్తే చర్యలు తప్పవన్న హెచ్చరికలు జారీ చేశారు. తమ సమస్యలను సంస్థ చైర్మన్, ఎండికు ముందుగా చెప్పకుండా మీడియాకు చెప్తే చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకునే అధికారాన్ని నేరుగా మేనేజింగ్ డైరెక్టర్‌కు అప్పగిస్తూ బోర్డు సమావేశంలో తీర్మానించారు.

అధికారికంగా ఆదేశాలు లేకున్నా... అనేక శాఖల్లో కూడా ఇదే తరహా విధానాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. నేరుగా చర్యలు లేకపోయినా కొన్ని శాఖల్లో మీడియా ముందుకు వెళ్తున్న ఉద్యోగులపై వేధింపు చర్యలకు దిగుతున్నట్లు చెబుతున్నారు.



విశాఖ కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టిన టిడిపి నాయకులు

'ఇదేం ఖర్మ.. మన బిసిలకు'

రాష్ట్రవ్యాప్తంగా టిడిపి ఆందోళనలు

కలెక్టరేట్ వద్ద ధర్నాలు - అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - యంత్రాంగం

'ఇదేం ఖర్మ.. మన బిసిలకు' పేరిట టిడిపి నాయకులు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో బుధవారం ఆందోళనలు, కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేపట్టారు. బిసి సమస్యలపై కలెక్టర్లను కలిసేందుకు శ్రీకాకుళంలో టిడిపి మాజీ ఎమ్మెల్యే గుండలక్ష్మీదేవి, జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆధ్వర్యంలో వెళ్తున్న నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టరేట్ గేటును పోలీసులు మూసివేయడంతో ఉద్రిక్తత నెలకొంది. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టారు. బిసీలను చిన్నచూపు చూస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు గుణపాఠం చెప్తారని కూన రవికుమార్ హెచ్చరించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నిరసనలు చేపట్టారు. బిసి గర్జన పేరుతో బిసిలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మోసం చేస్తున్నారంటూ విశాఖ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాల్లో మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, నక్కపల్లి మండలం నెల్లిపూడి వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వంగలపూడి అనిత పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. వినతిపత్రం ఇచ్చేందుకు ఐదుగురు మాత్రమే వెళ్లాలని సూచించారు. అయితే శాంతియుతంగా ర్యాలీ చేస్తున్నామని వినతిపత్రం ఇచ్చి బిసిల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, అందరినీ అనుమతించాలని టిడిపి నాయకులు కోరడంతో పోలీసులు నిరాకరించారు. ఈ సందర్భంగా వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాలకొల్లు, ఏలూరులో నిరసన తెలిపారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు.



పెళ్లి బృందానికి ప్రమాదం

- ట్రాక్టర్ బోల్తా పడి ఆరుగురు దుర్మరణం

ప్రజాశక్తి- పూతలపట్టు (చిత్తూరు జిల్లా)

పెళ్లి బృందం వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఆరుగురు మృతి చెందారు. వారిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. చిత్తూరు జిల్లాలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... పూతలపట్టు మండలం జెట్టిపల్లి గ్రామంలో జరుగుతున్న వివాహానికి ఐరాల మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన 25 మంది ట్రాక్టరులో బుధవారం బయలుదేరారు. పూతలపట్టు-కాణిపాకం రహదారిలో లక్ష్మయ్య ఊరు సమీపంలో ఈ ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వసంత (45), రెడ్డెమ్మ (31), తేజ (32), విసిష (3), దేవిక (2), ట్రాక్టర్ డ్రైవర్ సురేంద్ర (55) మృతి చెందారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇంటర్ కళాశాలల గుర్తింపు కోసం దరఖాస్తు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలల అనుమతి, అదనపు తరగతి గదుల నిర్వహణకి దరఖాస్తులు చేసుకోవాలని బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరి బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బోర్డు వెబ్‌సైట్ ఎపి.ఇంటర్.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఐఎన్‌లో దరఖాస్తులను ఈ నెల 8వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. రూ.10 వేల అపరాధ రుసుంతో 24 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను ఆర్ఐఓలు ఈ నెల 15 నుంచి జనవరి 3వ తేదీ వరకు పరిశీలిస్తారని వివరించారు.

విద్యా వజ్రోత్సవాలు

- జయప్రదం చేయాలని సంఘం పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐద్వా వజ్రోత్సవాల నేపథ్యంలో మహిళల హక్కుల రక్షణ, ఉపాధి కోసం, అత్యాచారాల నివారణ, సమానత్వ సాధన కోసం ఐద్వా శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యాన సదస్సు నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి తెలిపారు. విజయవాడలో సిద్ధార్థ కళాశాలలో శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 75 ఏళ్ల భారతావనిలో స్త్రీల హక్కులు, రక్షణ అంశాలకంటే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి 11 నిమిషాలకు ఒక బాలిక, ఒక మహిళ అత్యాచారానికి గురవుతున్నారని ఐరాస ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ప్రకటించడం స్త్రీలు, చిన్నారుల దుస్థితికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను నిర్మూలించాలని, అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని, ఉపాధి కల్పించాలని, స్త్రీ శిశు సంక్షేమ సమస్యలు, ఉపాధి హామీలో భాగస్వామ్యం చేయాలని, ఉద్యమాలను ఉధృతం చేయాలని, స్త్రీల రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. స్త్రీ తక్కువ పురుషుడు ఎక్కువ అనే మనువాద భావజాలాన్ని కూకటి వేళ్లతో పెకలించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీపై జరిగే నేరాలకు కారణమైన మద్యం, డ్రగ్స్ వంటి వాటిని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఇంటర్‌నెట్‌లో వస్తున్న అశ్లీల సాహిత్యాన్ని నిషేధించాలని, పోర్నోగ్రఫీని రూపుమాపాలని కోరారు. మీడియాలో వస్తున్న అశ్లీలత, స్త్రీలను తక్కువగా చూపుతూ వచ్చే ప్రచారాల నియంత్రించేందుకు మీడియా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. 'మహిళా హక్కులే-మానవ హక్కులు' అనే ప్రచారాన్ని నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వజ్రోత్సవాల్లో భాగంగా స్వయం పాలనలో మహిళలు, స్వయం సహాయక గ్రూపుల సాధికారత, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, అత్యాచారాల నివారణ-సమానత సాధన వంటి అంశాలతో సెమినార్లు జరుగుతాయని పేర్కొన్నారు. ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు యు వాసుకి, ట్రెజరర్ ఎస్ పుణ్యవతి, సెర్ప్ సిఇఓ ఎమ్‌డి ఇంతియాజ్, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని వెల్లడించారు.

స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణపై దేశ వ్యాప్తంగా అన్ని తరగతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 664వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ సింటర్ ప్లాంట్ విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు వై.మస్తానప్ప, డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, విళ్ళ రామ్మోహన్‌కుమార్, గుమ్మడి నరేంద్ర, డి.శ్రీనివాసులు మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తున్నవారి సంఖ్య పెరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ప్రజామోదం లేదనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశంలో కొత్త పరిశ్రమలను నెలకొల్పకపోగా ఉన్న వాటిని అమ్మేయడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు జె.వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, జి.వెంకటరావు, కెవి.సత్యనారాయణ, నారాయణరావు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐలో ఆసుపత్రిలో కీలక దస్త్రాలు, నగదు స్వాధీనం : ఇడి వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎన్ఆర్ఐ అకాడమి ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈ నెల 2న జరిపిన తనిఖీలు, సోదాలలో పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తెలిపింది. ఈ మేరకు బుధవారం ఇడి ప్రకటన విడుదల చేసింది. ఎన్ఆర్ఐకు సంబంధించి విజయవాడ, కాకినాడ, గుంటూరు, హైదరాబాద్‌లో జరిపిన సోదాల్లో కొంత నగదు, కీలక పత్రాలు సీజ్ చేసినట్లు తెలిపింది. మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించిన 53 డాక్యుమెంట్లు సీజ్‌చేసి స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. నిధుల మళ్లింపుతో సంబంధం వున్న నేరారోపణ పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనపరుచుకున్నామని పేర్కొంది. ఏపి పోలీసులు నమోదు చేసిన మనీలాండరింగ్ కేసు ఆధారంగా ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొంది. భవనాల నిర్మాణానికి, ఇతర అవసరాలకు ఎన్ఆర్ఐ సొసైటీకి చెందిన నిధులు మళ్లించినట్లు గుర్తించామని, కోవిడ్ రోగుల నుంచి వసూలు చేసిన మొత్తానికి, సంస్థ చూపిస్తున్న లెక్కలకు పొంతన లేదని పేర్కొంది. ఎంబిబిఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు అకౌంట్స్ బుక్స్‌లో వున్న మొత్తం కంటే ఎక్కువగా వసూలు చేసినట్లు గుర్తించినట్లు ఇడి తెలిపింది. ఎన్ఆర్ఐఎఎస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో మరో కంపెనీని రూపొందించి దాని ద్వారా ఎన్ఆర్ఐ సొసైటీకి చెల్లించాల్సిన నిధులను మళ్లించినట్లు గుర్తించారు.

ఆర్‌బికె ప్రమేయం లేకుండానే ధాన్యం మిల్లర్లకు అమ్ముకోవచ్చు

- ఆర్‌బికె ద్వారా అమ్మాలనే నిబంధన లేదు
- పౌరసరఫరాల సంస్థ ఎమ్‌డి వీరపాండియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు పండించిన ధాన్యం రైతు భరోసా కేంద్రం ద్వారానే అమ్మకోవాలనే నిబంధన లేదని, గిట్టుబాటు ధర ఐదుకు ఎక్కువ వస్తుందనుకుంటే రైతు ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు, మిల్లర్లకు ఎవరికైనా ఆర్‌బికె ప్రమేయం లేకుండానే అమ్ముకునే స్వతంత్రం ఉందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఎమ్‌డి వీరపాండియన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదుకు అమ్ముకున్న ధాన్యం వివరాలను మాత్రమే సమాచారం కోసం ఆర్‌బికెలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వానికి అమ్మాలనుకున్న ధాన్యం, నాణ్యత నిర్ధారించేది రైతు భరోసా కేంద్రాలు మాత్రమేనని ఇందులో మధ్యవర్తులు, మిల్లర్లకు ఎటువంటి ప్రమేయమూ లేదని తెలిపారు. ఒకసారి ఎఫ్‌టిఓ రైతు చేతికి అందించిన తర్వాత రైతు మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఎఫ్‌టిఓ ఇచ్చిన తర్వాత ఆ ధాన్యం బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఒకసారి ఆర్‌బికె వద్ద తేమశాతం, ఇతరనాణ్యతా ప్రమాణాలు నిర్ధారణ అయిన తర్వాత మిల్లర్లు ఏమైనా న్యాయానికి సంబంధించిన అంశాలను లేవనెత్తితే మిల్లు వద్ద ఉండే కస్టోడియన్ అధికారి, మండల స్థాయి సిబ్బంది సంబంధిత పిపిసితో చర్చించి పరిష్కరిస్తారని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబరు 1902 లేక 155251, ప్రధాన కార్యాలయ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబరు 18004251903, కమిషనరు కార్యాలయ టోల్ ఫ్రీ నెంబరు 1800 4250082/1967 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని వీరపాండియన్ తెలిపారు.

ఫేషియల్ హాజరు కోసం తనిఖీలు

- రంగంలోకి నేరుగా సిఎస్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల్లో ఉద్యోగులు, అధికారుల 'ఫేషియల్ హాజరు' అమలుపై ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. అందరూ తప్పనిసరిగా ఈ విధానంలో హాజరు నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ చాలామంది అధికారులు దీనిని పాటించడం లేదని ప్రభుత్వం గుర్తించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శే స్వయంగా రంగంలోకి దిగనున్నారు. ఇక నుండి ఆయన నేరుగా తనిఖీలు చేయాలని నిర్ణయించారు. ఒకటి, రెండు రోజుల్లోనే ఈ నిర్ణయం అమలులోకి రానుంది. ప్రతి శాఖలోనూ ఓపీ విభాగానికి సంబంధించిన మధ్య స్థాయి అధికారుల (ఎంఎల్‌ఓ) తప్పనిసరిగా మధ్యాహ్నం రెండు గంటల కల్లా హాజరుపై నివేదికలు ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. ఆ సమయంలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తనిఖీలు చేయనున్నారని సమాచారం.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులివ్వాలి : టీచర్స్ గిల్డ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పనిచేస్తున్న 3,400 మంది ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి చిట్టిబాబు, ఎలికె చిన్నప్ప బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంప్లాయీస్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అన్ని శాఖలకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ నుంచి ఆరోగ్య కార్డులు సౌకర్యం ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. ఎయిడెడ్ సిబ్బందికి కనీసం మెడికల్ రీయింబర్స్‌మెంట్ కూడా లేదని పేర్కొన్నారు. కరోనా సమయంలో 169 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు మరణించారని తెలిపారు. హెల్త్‌కార్డు లేకపోవడంతో కొన్ని కుటుంబాలు రూ.22 లక్షల వరకూ ఖర్చు చేశాయని వివరించారు. మరణించిన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద కలెక్టర్ పూల్‌లో ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని వెల్లడించారు.

ఐక్యపోరాటాలతోనే రైతాంగ సమస్యలకు పరిష్కారం

- అమరవీరుల జ్యోతి యాత్రలో ఎఐకెఎస్ నాయకుల ఉద్ఘాటన
- అనంతపురం మీదుగా కర్ణాటకకు చేరుకున్న యాత్ర



పామిడిలో ఎఐకెఎస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఐక్య పోరాటాలకు దేశ వ్యాప్తంగా రైతాంగం మరోమారు సన్నద్ధమవ్వాల్సిన అవసరముందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 13 నుంచి 16 వరకూ కేరళ రాష్ట్రంలోని త్రిసూర్‌లో జరగనున్న ఎఐకెఎస్ జాతీయ మహాసభను పురస్కరించుకుని దొడ్డి కొమరయ్య స్వగ్రామం తెలంగాణ రాష్ట్రం జనగాం జిల్లా కడవెండి గ్రామం నుంచి సోమవారం ప్రారంభమైన రైతు అమరవీరుల జ్యోతి యాత్ర బుధవారం అనంతపురం జిల్లాకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పామిడి వద్ద జాతాకు స్వాగతం పలికారు. పామిడి పట్టణంలోని బస్టాండ్ ఆవరణ నుంచి ఎద్దులపల్లి క్రాస్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జాతాకు నాయకత్వం వహిస్తున్న ఎఐకెఎస్ నాయకులు కృష్ణప్రసాద్, టి.సాగర్, ప్రకాశం మాస్టారు మాట్లాడారు. పామిడి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ఈ యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టి.సాగర్ మాట్లాడుతూ దేశంలో నెలకొన్న రైతాంగ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని అడుగుతుంటే ఇందుకు డబ్బుల్లేవని కేంద్రం చెప్పడం శోచనీయమన్నారు. కార్పొరేట్ సంస్థకు రూ.11 లక్షల కోట్లు రుణమాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వానికి కోట్లాది మంది రైతుల రుణాలు మాఫీ చేయడం పెద్ద సమస్య కాదని తెలిపారు. కనీస మద్దతు ధర, రుణమాఫీ, సమగ్రమైన పంటల బీమా కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరముందన్నారు. అందుకు ఐక్యపోరాటలే మార్గమని తెలిపారు.

నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలి

నకిలీ విత్తనాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఎఐకెఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పామిడి మండలం గజరాంపల్లి వద్ద పత్తి పంట పొలంకెళ్లి రైతులతో మాట్లాడారు. నకిలీ విత్తనాలు, బిటి. నాన్‌బిటి నిష్పత్తిలోని తేడాల వల్ల తీరని నష్టం జరిగిందని రైతులు ఎఐకెఎస్ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పత్తి రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. దేశ వ్యాప్తంగా పత్తి రైతుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసేలా ఈ నెల 13 నుంచి జరిగే జాతీయ మహాసభల్లో చర్చించి నిర్ణయిస్తామని తెలిపారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, వృత్తిదారుల సంఘం నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనంతపురం యువకునికి ఐక్యరాజ్యసమితి పురస్కారం

కేంద్ర మంత్రి చేతుల మీదుగా ప్రదానం

ప్రజాశక్తి - పుట్లూరు (అనంతపురం)

ఐక్య రాజ్య సమితి యువ పురస్కారాన్ని బుధవారం అనంతపురం జిల్లా పుట్లూరు మండలం కందికాపుల గ్రామానికి చెందిన బిసాటి భరత్ అందుకున్నారు. న్యూ ఢిల్లీలోని ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో ఐక్యరాజ్య సమితి రెసిడెంట్ కోఆర్డినేటర్ శింబో షార్ప్, ఐక్య రాజ్యసమితి ఆసియా పసిఫిక్ ప్రతినిధి శోకకొదా, కేంద్ర యువజన వ్యహరాలు, క్రీడా శాఖ మంత్రి అనురాగ్ సింగ్‌థాకుర్ ఈ అవార్డును భరత్‌కు ప్రదానం చేశారు. యువత అభివృద్ధి కోసం భరత్ చేస్తున్న విశిష్ట కృషిని గుర్తించి ఈ పురస్కారాన్ని అందించినట్లు ఐక్యరాజ్య సమితి అధికార ప్రతినిధి సుశీల్ తెలియజేశారు. జాతీయ సేవ పథకం, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ ద్వారా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను భరత్ నిర్వహిస్తున్నారు. యువతలో సేవా భావం, నాయకత్వ లక్షణాలు నింపడానికి రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, మహిళ సాధికారత, బాల్యవివాహాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, ఆజాదీ కా అమృత మహోత్సవం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై శిక్షణ తరగతులు, డిజిటల్ ఇండియా, మైగొవ్ వంటి ప్రతిష్టాత్మక కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల అంబాసిడర్‌గా చేస్తున్న విశిష్ట సేవలను ఐక్యరాజ్య సమితి గుర్తించింది.


కేంద్ర మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న భరత్

నేటి నుంచి గుంటూరు, బాపట్లలో చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా గురు, శుక్ర, శని వారాల్లో గుంటూరు, బాపట్లలో పర్యటించనున్నారు. గురువారం పెదకాకాని, నారాకోడూరు, పొన్నూరులో పర్యటన ఉంటుంది. నారాకోడూరులో రైతులతో సమావేశం అవనున్నారు. రాత్రి పొన్నూరులో బస చేయనున్నారు. శుక్రవారం ముస్లింలతో సమావేశం అవుతారు. అనంతరం బాపట్ల జిల్లాలో చుండూరుపల్లి, అప్పికట్ల గ్రామాల్లో ప్రజలతో మాట్లాడతారు. రాత్రి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస చేస్తారు. శనివారం అదే కళాశాలలో ఎస్‌సి విద్యార్థులు, మహిళలతో విడివిడిగా ముచ్చటించనున్నారు.

బిసిల గుండెల్లో టిడిపి: చంద్రబాబు

టిడిపి బిసిల గుండెల్లో ఉంటుందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. టిడిపి డిఎన్ఎ బిసిలు అని బుధవారం తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. జయహోబిసి స్లోగన్ టిడిపిదేనని తెలిపారు. టిడిపి మాజీమంత్రి ఎమ్మెల్సీ వివివి చౌదరి రూపొందించిన పుస్తకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు.

యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - మహానంది (నంద్యాల)



అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నంద్యాల జిల్లా మహానంది మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గాజులపల్లి గ్రామానికి చెందిన రైతు నాగన్న (27)కు మూడు ఎకరాల సొంత పొలముంది. దీనికి తోడు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేశారు. సాగు నిమిత్తం రూ.ఆరు లక్షలు అప్పులు చేశారు. పంటకు తెగుళ్లు ఆశించడం, ధర లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. రుణదాతల ఒత్తిడి పెరగడం, అప్పులు తీరే దారి కనిపించకపోవడంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


లొంగిపోయిన మిలీషియా సభ్యుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి సతీష్ కుమార్

34 మంది మిలీషియా సభ్యుల లొంగుబాబు

ప్రజాశక్తి - పాడేరు టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మావోయిస్టు పార్టీ పెదబయలు ఏరియా కమిటీ సభ్యురాలితో సహా 34 మంది మిలీషియా సభ్యులు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ ఎదుట లొంగిపోయారు. వారి వివరాలను పాడేరులోని ఎస్‌పి కార్యాలయంలో మీడియాకు ఎస్‌పి బుధవారం వెల్లడించారు. ఎస్‌పి మాట్లాడుతూ... లొంగిపోయిన మిలీషియా సభ్యులు అల్లూరి జిల్లా పెదబయలు, ముంచంగిపుట్టు సహా సరిహద్దు రాష్ట్రాల్లోని మల్కన్‌గిరి, చిత్రకొండ ప్రాంతాలకు చెందిన వారని తెలిపారు. వారితోపాటు మావోయిస్టు పార్టీ సభ్యురాలైన కిల్లో ఇందు అలియాస్ భారతి అలియాస్ గెమ్మెలి భారతి లొంగిపోయారని చెప్పారు. మావోయిస్టు పార్టీ బెదిరింపులకు భయపడి వీరంతా మిలీషియా సభ్యులుగా చేరారన్నారు. ఈ క్రమంలోనే మందు పాత్రలు పేల్చడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చేయడం, రోడ్డు నిర్మాణ యంత్రాలను తగులు పెట్టడం, ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనులను హతమార్చడం, పోలీసుల సమాచారం చేరవేయడం వంటి పనులు చేశారని తెలిపారు. లొంగిపోయిన మిలీషియా సభ్యులకు పునరావాస చర్యలు చేపడతామని వెల్లడించారు. లొంగిపోయిన వారి నుంచి ఆరు మ్యాన్‌ప్యాక్ సెట్లు, ఐదు ఛార్జర్లు, ఒక కంట్రీమేడ్ ఎయిర్ పిస్టల్, ఒక ల్యాండ్‌మైన్, ఐదు కిలోల కార్టెక్స్, మూడు క్లైమోర్ మైన్స్, ఒక సేఫ్టీ ఫ్యూస్, వంద మీటర్ల ఎలక్ట్రికల్ వైరు, పవర్ సప్లయి అడాప్టర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు.

మూడున్నరేళ్ల తరువాత బిసిలు గుర్తొచ్చారా ?

టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ల తరువాత జగన్‌కు బిసిలు గుర్తొచ్చారా అని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రశ్నించారు. స్వాతంత్రం వచ్చాక బిసిలకు ఏ ముఖ్యమంత్రీ చేయనంత అన్యాయం చేశారని విమర్శించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన తరగతుల వెన్నుముక విరిచేసిన జగన్‌కు బిసిల పేరెత్తే అర్హత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో టిడిపి కల్పించిన 34 శాతం రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించినందుకు బిసిలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2.70 కోట్లమంది వెనుకబడిన తరగతుల జనాభా సబ్‌ప్లాన్ నిధులు మళ్లించడం ద్రోహం కాదా అని ప్రశ్నించారు. ముఖ్యపదవులు తన సామాజిక వర్గానికి ఇచ్చుకొని సామాజిక అన్యాయంపై బిసి సభావేదిక నుంచి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిసిలకు ఆదరణ నిలిపేసినందుకా జయహో అని బిసిలు నినదించాలని విమర్శించారు.

బిసి జపం ఎన్నికల స్టంట్ : బుద్దా వెంకన్న

సిఎంకు ఉన్నపళంగా బిసిలపై ప్రేమపుట్టుకు రావడం అంతా ఎన్నికల స్టంట్‌లో భాగమని టిడిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి బుద్ధా వెంకన్న విమర్శించారు. మూడున్నరేళ్లలో బిసినేతలు హత్యలు, వారిపై దాడులు, వేధింపులకు పాల్పడి, వారి ఆస్తులు, భూములు లాక్కున్నారని తెలిపారు. టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్ని సభలు పెట్టినా, తలకిందులుగా తపస్సు చేసినా జగన్‌కు బిసిల మద్దతు లభించదని విమర్శించారు బిసిలకు చంద్రబాబు చేసిన మేలు, జగన్ చేసిన ద్రోహంపై చర్చించడానికి సిద్ధమని, మంత్రులు అప్పలరాజు, జోగిరమేష్‌కు సవాల్ విసిరారు. అవసరమైతే వైసిపి కార్యాలయానికి వెళ్లడానికి తాను సిద్ధమేనని పేర్కొన్నారు.

బిసిల సంక్షేమంపై శ్వేతపత్రం

దగ్గుపాటి పురంధరేశ్వరి డిమాండు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి మూడున్నరేళ్ల పాలనలో వెనుకబడిన వర్గాలకు చేసిన మేలు ఏమిటో శ్వేతపత్రం విడుదల చేయాలని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి పురంధరేశ్వరి డిమాండ్ చేశారు. బిసిలకు గుర్తింపు తెచ్చి వారిలో నాయకత్వ లక్షణాలు నేర్పింది ఎన్‌టిఆర్ అని పేర్కొన్నారు. విజయవాడ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన మైనార్టీమోర్చా శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైసిపి బిసి కార్పొరేషన్లను ప్రారంభించడమే గొప్పగా భావిస్తే సరిపోదని, ఆయా కార్పొరేషన్లకు నిధులూ కేటాయించాలని డిమాండ్ చేశారు. బిసి కులాలను విడదీసి కులాల కుంపట్లు పెడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైనార్టీ మోర్చా జాతీయ అధ్యక్షులు జమాల్‌సిద్ధికీ పాల్గొన్నారు.

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ

జాతీయ రహదారుల చట్టం, 1956లోని సెక్షన్ 3G (3) క్రింద

సత్యమేవ జయతే

BHARATMALA ROAD TO PROSPERITY

బహిరంగ ప్రకటన

జాతీయ రహదారుల చట్టం 1956లోని సెక్షన్ 3జి(3) క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాకినాడ జిల్లాలో కి.మీ. 0.000 - కి.మీ. 12.250 వరకు జాతీయ రహదారి నెం.516F లోని సామర్లకోట్ నుండి అచ్చంపేట జంక్షన్ వరకు (నాలుగు వరుసల) రహదారి నిర్మాణం మేనేజ్మెంట్ మరియు ఆపరేషన్ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాకినాడ జిల్లాలో కి.మీ. 0.000 - కి.మీ. 12.250 వరకు జాతీయ రహదారి నెం.516 F నిర్మాణం (రోడ్ వెడల్పు చేయుట / నాలుగు వరుసల / మొదలైనవి) నిర్వహణ, మేనేజ్మెంట్ మరియు ఆపరేషన్ కోసం భారత విశేష రాజపత్రం సంచిక నెం. 4883 పార్ట్ II, సెక్షన్-3, ఉప సెక్షన్ - (ii), తేదీ: 2 -11- 2022 ప్రచురించబడిన, యస్.ఓ. నెం. 5102 (ఇ) తేదీ.2.11.2022 భారత ప్రభుత్వం, రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రకారం జాతీయ రహదారుల చట్టం 1956 (48/1956) లోని సెక్షన్ 3డి(2) క్రింది తాకట్టు రుణభారాలు ఏవీ లేకుండా దిగువ షెడ్యూలులో తెలిపిన భూములు, కట్టడాలు మరియు చెట్లు మొదలగు వాటితో కేంద్ర ప్రభుత్వానికి సక్రమించాయి. సదరు భూములలో ప్రయోజనం గల వ్యక్తులందరూ తమ భూములకు చెందిన డాక్యుమెంట్లు / పట్టాదారు పాసు పుస్తకాలు / టైటిల్ డీడ్స్ లేదా ఏవేని ఇతర సంబందిత డాక్యుమెంట్లు యొక్క అసలు డాక్యుమెంట్లు మరియు జిరాక్స్ కాపీలతో వారికి ఏవేని కట్టడాలు ఉంటే ఆమోదిత ప్లాన్లు, పన్ను అసేస్మెంట్స్ పన్ను రసీదులతో స్వయంగా లేదా ఏజెంట్లు ద్వారా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా ఆర్.డి.ఒ., కాకినాడ కార్యాలయం లోని సమర్ధ ప్రాధికారి (భూసేకరణ) మరియు రెవెన్యూ డివిజినల్ అదికారి వారి సమక్షంలో దిగువ తెలిపిన విధముగా ప్రతి గ్రామానికి ఎదురుగా తెలిపిన తేదీలలో హాజరు కావలసిందిగా మరియు సదరు భూమిలలో వారి సంబంధిత ప్రయోజనం మరియు హక్కుల స్వభావాన్ని తెలియజేయవలసిందిగా కోరబడుతున్నారు.

జిల్లా పేరు	మండలం పేరు	గ్రామం పేరు	విచారణ కార్యాలయము	తేది మరియు సమయం
కాకినాడ జిల్లా	సోమర్లకోట	భీమవరం	రెవెన్యూ డివిజనల్ అధికారి వారి, కార్యాలయము కాకినాడ.	తేది. 20.12.2022 సమయం : 11.00 ఉదయం
		జగ్గమ్మగారిపేట		
		వల్లూరు		
		పనసపాడు	రెవెన్యూ డివిజనల్ అధికారి వారి, కార్యాలయము కాకినాడ.	తేది. 21.12.2022 సమయం : 11.00 ఉదయం
	కాకినాడ రూరల్	తిమ్మాపురం		
		రమణయ్యపేట		

రాష్ట్రం : ఆంధ్ర ప్రదేశ్ జిల్లా : కాకినాడ

క్రమ. సం.	సర్వే నెం.	భూమి స్వభావం	భూమి వివరణ	విస్తీర్ణం	రైతు పేరు	ఈ స్థలంలో ఉన్న నిర్మాణాలు, చెట్లు వగైరా వివరాలు
1	2	3	4	5	6	7
తాలుకా పేరు : సామర్లకోట						గ్రామం పేరు : జగ్గమ్మగారిపేట
1	73/2	ప్రభుత్వ	పుంజ	38.290	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
2	73/3B	జిరాయితి	పుంజ	56.828	ఆర్.ఎ.కె.సిరామిక్స్, సామర్లకోట	
3	77/1B	ప్రభుత్వ	పుంజ	36.254	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
4	77-2B1	జిరాయితి	పుంజ	222.439	ఆర్.ఎ.కె.సిరామిక్స్, సామర్లకోట	
5	110-1A	జిరాయితి	పుంజ	99.055	నవభారత్ వెంచెర్స్ లిమిటెట్, సామర్లకోట	
6	112/1	ప్రభుత్వ	పుంజ	2.398	రైల్వే భూమి	
7	113-2B	జిరాయితి	పుంజ	113.433	నవభారత్ వెంచెర్స్ లిమిటెట్, సామర్లకోట	
8	114-2	జిరాయితి	నంజ	29.496	నవభారత్ వెంచెర్స్ లిమిటెట్, సామర్లకోట	
9	115-2B	జిరాయితి	పుంజ	40.469	నవభారత్ వెంచెర్స్ లిమిటెట్, సామర్లకోట	
10	116/2	ప్రభుత్వ	రైల్వే	34.686	రైల్వే భూమి	
11	117-2A	జిరాయితి	పుంజ	33.890	లేట్ పుప్పల అప్పన్న	
12	118/2	ప్రభుత్వ	బాట	90.359	భాట దారి	
13	119-4A	జిరాయితి	పుంజ	662.374	మాసిన శివ రామకృష్ణ, మాసిన స్రవంతి, మాసిన మౌనిక	
14	135/2	ప్రభుత్వ	పుంజ	279.942	రోడ్డు - కాలువ	
15	144-2	జిరాయితి	నంజ	233.417	యార్లగడ్డ బాపినీడు	
16	145-2	జిరాయితి	నంజ	739.449	యార్లగడ్డ బాపినీడు, పోతుల శ్రీలక్ష్మి	
17	146-2	జిరాయితి	నంజ	19.801	పోలిన వినీల, కంటిపూడి విజయ లక్ష్మి, యార్లగడ్డ వీర వెంకట రావు	
18	151/2	ప్రభుత్వ	పుంత రోడ్డు	3.621	బాట దారి	
19	152-1B	జిరాయితి	పుంజ	97.408	ఎం. సూరిబాబు (ప్లాట్ నెం. 8 పార్ట్) బి.సత్యవతి, ఎం. తాతయ్య, యు.దేవి మరియు ఇతరులు (ప్లాట్ నెం. 9 మరియు 11 పార్ట్) ఎం. సత్తిబాబు (ప్లాట్ నెం. 10 మరియు 11 పార్ట్) ఎస్.జ్యోతమ్మ (ప్లాట్ నెం. 16) ఎన్. లక్ష్మి (ప్లాట్ నెం. 17 పార్ట్)	
తాలుకా పేరు : సామర్లకోట						గ్రామం పేరు : పనసపాడు
20	122/1B	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	6623.710	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
21	122/4A-2	జిరాయితి	నంజ	178.322	వైట్ల భాస్కర చౌదరి	
22	122/4C1	జిరాయితి	నంజ	1537.840	శ్రీరిమిల్లి ఉదయ్ కిరణ్ వత్సవాయి సంధ్యారాణి	
23	123/1B	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	3431.940	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
24	123/1C1	జిరాయితి	నంజ	364.225	కంటిపూడి సారధి	
25	123/3A2	జిరాయితి	నంజ	283.286	వెంకుమహంతి విక్రమ్ కుమార్	
26	123/3C1	జిరాయితి	నంజ	283.286	వెలగల వెంకట రామిరెడ్డి	
27	123/4A	జిరాయితి	నంజ	121.408	కారిపినేని నాగేశ్వరరావు	
28	124/2B	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	5137.458	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
29	124-3C1	జిరాయితి	నంజ	134.119	కంటిపూడి సారధి	
30	124-5B3A	జిరాయితి	నంజ	687.981	కంటిపూడి సారధి	
31	124-5C3A	జిరాయితి	నంజ	526.103	కంటిపూడి సారధి	
32	124-6C1A	జిరాయితి	నంజ	1052.506	మంతేన వెంకట రాజు	
33	128/2B	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	6799.105	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
34	128-2C1A	జిరాయితి	నంజ	3135.568	బాబ లేఅవుట్ ప్లాట్ నెం. 99, 104, 110, 138, 146, 188, 189, 194, 199, 204, 209, 215, 216, 217, 218, 219, 220, 226, 225, 224, 221, 222, 223, 94, 100, 105, 111, 139, 147, 187, 190, 195, 200, 205, 210	
35	164-4B1	జిరాయితి	నంజ	517.239	మేడపాటి నీరజ, కర్రి ప్రభావతి మరియు పుప్పల రాంజీ	
36	169	ప్రభుత్వ	కాలువ	420.109	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
37	171/1B2	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	1041.680	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
38	198/1B	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	2488.976	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
39	198/1C1A	జిరాయితి	నంజ	278.944	కర్రి సురేష్ రెడ్డి, సిరిగిన వీర వెంకట సత్యనారాయణ	
40	198/1C3A	జిరాయితి	నంజ	282.300	సిరిగిన వీర వెంకట సత్యనారాయణ మరియు లలిత్ కుమార్ జైన్	
41	192/2B	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	2657.446	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
42	192/8A2	జిరాయితి	నంజ	182.430	నడుంపల్లి రామరాజు	
43	192/5B	జిరాయితి	నంజ	40.470	నడుంపల్లి రామరాజు మరియు ఇతరులు ఇండ్ల స్థలము	
44	192/6B	జిరాయితి	నంజ	80.940	చోడిశెట్టి రాజారావు, గరగ లక్ష్మి మొదలగునవి., (ఇండ్ల స్థలము)	
45	192/9B	జిరాయితి	నంజ	80.940	నడుంపల్లి రామరాజు మరియు ఇతరులు ఇండ్ల స్థలము	
46	230/5F2	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	1330.318	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
47	230/7A	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	242.810	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
48	230/7B1	జిరాయితి	నంజ	91.513	చెగోండి సత్యనారాయణమ్మ పబ్బినీడి రాజారావు	
49	230/5G3A	జిరాయితి	నంజ	125.630	చెగోండి సత్యనారాయణమ్మ పబ్బినీడి రాజారావు	
50	233/2	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	780.083	బండిదారి	
51	171-3C1	జిరాయితి	నంజ	107.360	సలాది చంద్రావతి	
52	157/16B	ప్రభుత్వ	నంజ	1659.250	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
53	157-16A2	జిరాయితి	నంజ	526.103	జనచైతన్య మరియు జంగా వి.నాగేంద్ర కుమార్	
54	160/1A1	ప్రభుత్వ	నంజ	202.350	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
55	160-1A-2A	జిరాయితి	నంజ	364.225	వింటి సుబ్రహ్మణ్యం	
56	160-1B1	జిరాయితి	నంజ	202.347	కంటిపూడి సారధి	
57	165/1B	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	5261.030	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
58	165-1A-2	జిరాయితి	నంజ	121.408	మేడపాటి ధర్మారెడ్డి మరియు కర్రి సత్య సుబ్బారెడ్డి	
59	165-2A-2	జిరాయితి	నంజ	40.469	మేడపాటి నీరజ	
60	165-4B-3	జిరాయితి	నంజ	607.042	ఎం. ధర్మారెడ్డి మరియు గంటి సత్యనారాయణ	
61	173/1B	ప్రభుత్వ	ప్రభుత్వ పోరంబోకు	7082.150	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
62	173-1A2	జిరాయితి	నంజ	728.450	పి.ఎ.ఎ.కె.వి.బి.చౌదరి	
63	173-2A2	జిరాయితి	నంజ	728.450	జ్యోతుల వెంకటేశ్వరరావు	
64	173-1C	జిరాయితి	నంజ	849.858	సలాది చంద్రావతి	
65	173-3B1	జిరాయితి	నంజ	809.389	సలాది చంద్రావతి	
తాలుకా పేరు : కాకినాడ రూరల్						గ్రామం పేరు : రమణయ్యపేట
66	18/3B	ప్రభుత్వ	పుంజ	298.460	లేఅవుట్ ఖాళీ స్థలము ఎల్.పి.నెం. 631/1985 ప్రస్తుత ఎడిబి రోడ్డు	
తాలుకా పేరు : కాకినాడ రూరల్						గ్రామం పేరు : తిమ్మాపురం
67	69/3B	ప్రభుత్వ	పుంజ	296.729	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
68	71/1A	ప్రభుత్వ	పుంజ	2985.651	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
69	74/1B	ప్రభుత్వ	పుంజ	2185.300	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
70	75/1	ప్రభుత్వ	పుంజ	10.399	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
71	75/2A	జిరాయితి	నంజ	224.916	పప్పుల సాయిబాబు మరియు ఇతరులు (నాన్ లేఅవుట్) ప్లాట్ నెం.1 (141.62 చ. మీ) మరియు ప్లాట్ నెం. 10 (141.62 చ. మీ)	
72	75/2A	ప్రభుత్వ	పుంజ	46.447	లేఅవుట్ రోడ్డు	
73	77/1B	ప్రభుత్వ	పుంజ	283.280	లేఅవుట్ రోడ్డు	
74	77/2A2	జిరాయితి	పుంజ	38.260	సత్తి సత్తిరెడ్డి ఇండ్ల స్థలం	
75	78/1A	ప్రభుత్వ	పుంజ	150.089	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
76	78/1B1	ప్రభుత్వ	పుంజ	169.450	లేఅవుట్ రోడ్డు	
77	92/3A	ప్రభుత్వ	పుంజ	485.080	లేఅవుట్ రోడ్డు	
78	95	జిరాయితి	పుంజ	12.141	ప్లాట్ నెం. 1 లో ఎల్.పి.నెం. 379/87	
79	97/2A2	జిరాయితి	పుంజ	80.937	నల్లం వీర వెంకట సత్యనారాయణ (నాన్ లేఅవుట్) ప్లాట్ నెం.2	
80	97/2A2	జిరాయితి	పుంజ	80.937	కేశన చిట్టిబాబు (నాన్ లేఅవుట్)ప్లాట్ నెం.3	
81	97/2A2	జిరాయితి	పుంజ	80.937	ఎన్.వి.వి. సత్యనారాయణ మరియు రెడ్నం చంద్రరావు (నాన్ లేఅవుట్)ప్లాట్ నెం.4	
82	97/2A2	జిరాయితి	పుంజ	121.406	మట్టా రామ వెంకట సత్యనారాయణ (నాన్ లేఅవుట్) ప్లాట్ నెం.7	
83	97/2A2	జిరాయితి	పుంజ	80.937	బిక్కిన అజయ కుమార్ (నాన్ లేఅవుట్) ప్లాట్ నెం.8	
84	97/2A2	జిరాయితి	పుంజ	80.937	(నాన్ లేఅవుట్) ప్లాట్ నెం.11	
85	97/2A2	జిరాయితి	పుంజ	80.937	(నాన్ లేఅవుట్) ప్లాట్ నెం.12	
86	97/2A2	జిరాయితి	పుంజ	80.937	(నాన్ లేఅవుట్) ప్లాట్ నెం.13	
87	97/2A2	జిరాయితి	పుంజ	80.937	(నాన్ లేఅవుట్) ప్లాట్ నెం.14	
88	97/2A2	జిరాయితి	పుంజ	80.937	(నాన్ లేఅవుట్) ప్లాట్ నెం.15	
89	107/1A	ప్రభుత్వ	పుంజ	1297.035	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
90	107/1B1	జిరాయితి	పుంజ	937.886	శ్రీ కె.వి.ఆర్.పార్కింగ్ ప్రైవేట్.లిమిటెట్	
91	109	ప్రభుత్వ	పుంజ	2630.456	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
92	76	ప్రభుత్వ	పుంజ	53.719	ప్రస్తుతం ఉన్న ఎడిబి రోడ్డు	
93	99	ప్రభుత్వ	పుంజ	170.870	ప్రస్తుత ఎడిబి రోడ్డు (ఎల్.ఎఫ్)	
94	106/1A	ప్రభుత్వ	పుంజ	3.162	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
95	93/1	ప్రభుత్వ	పుంజ	3393.857	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
96	108	ప్రభుత్వ	పుంజ	206.953	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
97	97/1B	ప్రభుత్వ	పుంజ	157.111	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
98	334/5B	ప్రభుత్వ	పుంజ	1051.680	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
99	334/9A	ప్రభుత్వ	పుంజ	161.788	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
తాలుకా పేరు : సామర్లకోట						గ్రామం పేరు : వల్లూరు
100	44/3B	జిరాయితి	నంజ	568.175	మెర్ల ఆదిత్య కృష్ణ	
101	52/2B	జిరాయితి	నంజ	559.623	కోప్పిరెడ్డి ఆర్.జె.ఎం. కీర్తి నాయుడు	
102	64/2	జిరాయితి	నంజ	440.723	రావు రమాదేవి	
103	65/2	జిరాయితి	నంజ	107.811	రావు రమాదేవి	
104	70/1	జిరాయితి	నంజ	43.695	రావు సీతారామ స్వామి	
105	72/5	జిరాయితి	నంజ	36.848	ప్రత్తిపాటి అమ్మాజి	
106	75/2	జిరాయితి	నంజ	460.265	కోప్పిరెడ్డి రాజ పృధ్వీ నాయుడు	
107	116/4A	జిరాయితి	నంజ	93.371	మామిడాల సూరీడు	
108	128/4B	జిరాయితి	నంజ	890.309	పెపకాయల వెంకన్న (ఇండ్ల స్థలాలు)	
109	129/3A	జిరాయితి	నంజ	335.346	చెకూరి బాల త్రిపుర సుందరి మరియు గోడవర్తి లక్ష్మి శాంతి	
110	86/2	ప్రభుత్వ	నంజ	4057.579	పంట కాలువ	
111	128/2B1	ప్రభుత్వ	నంజ	978.239	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
112	149/3	ప్రభుత్వ	నంజ	38.790	పంట కాలువ	
113	129/2	ప్రభుత్వ	నంజ	157.063	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
114	151/1B	ప్రభుత్వ	నంజ	79.662	ప్రస్తుత ఎడిబి రోడ్డు	
తాలుకా పేరు : సామర్లకోట						గ్రామం పేరు : భీమవరం
115	244-1B	జిరాయితి	నంజ	112.744	కంటిపూడి విజయలక్ష్మి	
116	223-4B	జిరాయితి	నంజ	3243.061	పైని వెంకట్రావు, శ్రీనివాస్	
117	164-2B	జిరాయితి	నంజ	170.647	ఉండవిల్లి వెంకట్రావు	
118	162-2	జిరాయితి	నంజ	526.242	ఈదల వరలక్ష్మి (3884.99 చ.మీ) ఈదల రామకృష్ణన్ చౌదరి (5544.20 చ.మీ) అనపర్తి కృష్ణ కుమారి (40.47 చ.మీ)	
119	171-2	జిరాయితి	నంజ	55.195	కారుకోండ వి వి లక్ష్మి నారాయణ (1578.28 చ.మీ) పల్లి విజయ భారతి (1942.49 చ.మీ) కారుకోడం ఉదయ సంధ్య (1537.81 చ.మీ)	
120	157-2	జిరాయితి	నంజ	663.845	యార్లగడ్డ రాజబాబు (7486.69 చ.మీ) గోలి సీతారామయ్య చౌదరి (1618.74 చ.మీ)	
121	123-2	జిరాయితి	నంజ	400.078	యరమాటి వాణి	
122	121-2B	జిరాయితి	నంజ	4055.276	యరమాటి వాణి	
123	120-2B	జిరాయితి	నంజ	341.869	నిడదవోలు సూర్యనారాయణ	
124	120-3A	జిరాయితి	నంజ	890.309	చుండ్రు దివాకర్	
125	117-2	జిరాయితి	నంజ	66.993	గారపాటి శ్రీనివాస్, బలుసు శ్రీనివాస్	
126	118-2	జిరాయితి	నంజ	129.789	యార్లగడ్డ వీర వెంకట రమణ, చుండ్రు అనసూయ	
127	488/1B	ప్రభుత్వ	నంజ	119.581	రోడ్డు	
128	488-3B	జిరాయితి	నంజ	1969.816	యార్లగడ్డ వీరేంద్ర	
129	489-5B	జిరాయితి	నంజ	485.623	మాసిన రామ్ ప్రకాష్	
130	301-2B	జిరాయితి	నంజ	13473.213	యార్లగడ్డ నారాయణ అప్పారావు మరియు ఇతరులు	
131	496-2B6	జిరాయితి	పుంజ	122.093	బుర్ర రామకృష్ణ	
132	114/2	ప్రభుత్వ	నంజ	135.460	కాలువ	
133	125/2	ప్రభుత్వ	నంజ	276.789	పంట కాలువ	
134	218/2	ప్రభుత్వ	నంజ	53.538	కాలిభాట	
135	174/2	ప్రభుత్వ	నంజ	898.143	రోడ్డు	
136	488/1B	ప్రభుత్వ	నంజ	119.581	రోడ్డు	
137	495/2	ప్రభుత్వ	నంజ	971.246	రైల్వే భూమి	
			మొత్తం	119291.36		

సం/-
కాంపిటెంట్ అథారిటీ (ఎల్ ఎ) మరియు
రెవిన్యూ డివిజినల్ అధికారి, కాకినాడ

సంపాదకీయం

డేటా భద్రతకు ముప్పు

అత్యాధునిక డిజిటల్ వ్యవస్థల లోపాలను దేశ భద్రతకు, ప్రజానీకానికి పొంచి ఉన్న ముప్పును ఎత్తి చూపుతున్నాయి.

దేశంలోని ప్రతిష్టాత్మకమైన వైద్య, శాస్త్ర పరిశోధన సంస్థలపై వరుసగా జరుగుతున్న సైబర్‌దాడులు కలవరాన్ని కలిగిస్తున్నాయి. ఢిల్లీలోని ఎయిమ్స్‌పై హ్యాకర్లు దాడి చేసి కీలక డేటాను తస్కరించిన అంశం ప్రకంపనలు సృష్టిస్తుండగానే, పరిశోధనలకు నెలవైన భారత వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్)పై పంజా విసిరిన తీరు ఆందోళనకరం. అత్యంత కీలకమైన ఈ సంస్థపై ఒక్కరోజులోనే ఆరువేలసార్లు హ్యాకింగ్ యత్నాలు జరిగాయి. ఎయిమ్స్‌కు సమీపంలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి, తమిళనాడులోని శ్రీ శరణ్ ఆస్పత్రిపై కూడా హ్యాకర్లు దాడులు చేశారు. శ్రీ శరణ్ ఆస్పత్రికి చెందిన పేషంట్ల డేటాను డార్క్ వెబ్‌సైట్‌లో అమ్మకానికి పెట్టడం, ఎయిమ్స్ డేటాను తమ ఆధీనంలోకి తీసుకుని 200 కోట్ల రూపాయలు ఇస్తేనే వెనక్కి ఇస్తామని బ్లాక్‌మెయిల్ చేయడం హ్యాకర్ల బరితెగింపునకు నిదర్శనం. రాన్‌సమ్‌వేర్ ద్వారా ఎయిమ్స్ సర్వర్‌ను, కంప్యూటర్లను హ్యాకర్లు తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. దీని ప్రభావం ఎయిమ్స్‌లోని అన్ని విభాగాలపై పడింది. ఒకటి, రెండు రోజులు వైద్యసేవలను అత్యంత కనిష్ట స్థాయికి కుదించారు. ఈ సైబర్ దాడి జరిగి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో సర్వర్ వ్యవస్థను పునరుద్ధరించలేదు. అనేక విభాగాల్లో ఇప్పటికీ మాన్యువల్ పద్ధతిలో పనులు నిర్వహిస్తున్నారు. హ్యాకర్ల బ్లాక్‌మెయిల్‌కు లొంగకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా డేటాను ఎయిమ్స్ తిరిగి పొందడమే కొంత ఊరట ఇచ్చే అంశం. వరుసగా జరిగిన దాడులు మన అత్యాధునిక డిజిటల్ వ్యవస్థల లోపాలను దేశ భద్రతకు, ప్రజానీకానికి పొంచి ఉన్న ముప్పును ఎత్తి చూపుతున్నాయి.

సైబర్ దాడులపై అధ్యయనం చేసే కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్-ఎ.ఐ) సంస్థ క్లౌడ్ ఎస్ఇకె ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఈ తరహా దాడులు పెరగుతున్నాయి. వైద్య ఆరోగ్య రంగంలో ఈ పెరుగుదల మరింత ఆందోళనకరంగా ఉంది. గత ఏడాది మొదటి నాలుగు నెలలతో పోలిస్తే ఈ ఏడాది అదే సమయంలో హెల్త్ కేర్ రంగంపై దాడులు 95.35 శాతం పెరిగాయి. దాడులకు గురవుతున్న దేశాల్లో భారత్ రెండవ స్థానంలో ఉంది. మరోవైపు భద్రతా ప్రమాణాలపై నిపుణులు చేసిన హెచ్చరికలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌ను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. పేషంట్లకు సంబంధించిన సమస్త వివరాలను, వైద్యుల సిఫార్సులను డిజిటల్‌గా నిలువచేయడం ప్రారంభించింది. కరోనా విజృంభణ సమయంలో ప్రారంభించిన కోవిన్ పోర్టల్ కూడా ఇటువంటిదే! ఆ సమయంలోనూ సైబర్ నిపుణులు చేసిన హెచ్చరికలను కేంద్రం పట్టించుకోలేదు. ఇటువంటి సమాచారం కోసమే హ్యాకర్లు దాడులు చేస్తారని, అలా తస్కరించిన డేటాను ఇన్సూరెన్స్ కంపెనీలతో పాటు, వైద్య,ఆరోగ్య రంగానికి చెందిన వివిధ కార్పొరేట్ సంస్థలకు భారీ మొత్తాలకు అమ్ముకుంటున్నారన్నది క్లౌడ్ ఎస్ఇకె సంస్థ సర్వే సారాంశం. ఎయిమ్స్‌లో దేశానికి చెందిన అత్యంత ముఖ్యమైన వ్యక్తుల సమాచారాన్ని నిక్షిప్తం చేస్తుండటం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం.

అమెరికా, చైనా, రష్యా, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ డిజిటల్ వ్యవస్థల భద్రతకోసం దాదాపుగా ప్రభుత్వ సర్వర్లన్నింటినీ ఒకే పోర్టల్ కిందకు తీసుకువచ్చి పటిష్టమైన రక్షణ వ్యవస్థలను (ఫైర్‌వాల్స్)ను అభివృద్ధి చేశాయి. మన దేశంలో పాలకవర్గాలు తాత్కాలిక ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుండటంతో ఆ తరహా ఆవిష్కరణలు క్లిష్టంగా మారుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఆరోగ్య రంగానికే కాకుండా, దేశ భద్రతకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పటిష్టమైన రక్షణ చర్యలు లేకుండా జరిగే డిజిటలైజేషన్ ప్రక్రియ మొదటికే మోసంగా మారుతుంది. ఆ పరిస్థితి ఏర్పడితే కేంద్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత! ఆధార్ కార్డుల జారీ పేరుతో సేకరించిన సమాచారం కూడా ఇప్పటికే అనేక మార్లు లీక్ అయింది. తాజా దాడుల తరువాతైనా కేంద్ర ప్రభుత్వం సైబర్ భద్రతపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలి. ప్రజల వ్యక్తిగత సమాచారానికి పూర్తి భద్రతనిచ్చే దుర్భేధ్యమైన రక్షణ వ్యవస్థను రూపొందించాలి. ఈ తరహా దాడులకు పాల్పడే హ్యాకర్లను కఠినంగా శిక్షించాలి.

మహనీయుల మాట



ప్రజలంతా రాజకీయంగా చైతన్యవంతులై వుండాలనీ... ఐక్యంగా దోపిడీ వర్గాల ప్రభావాల నుంచి దూరంగా, వెనకబాటుతనానికీ దూరంగా వుండాలని కొందరు భావిస్తారు. కాని ప్రజలంతా అలా వుంటే ఇంక విప్లవం సాధించడంలో కష్టమేముంటుంది?

- లీషావ్‌చీ

రాయలసీమ వెనుకబాటు - దోషులు ఎవరు?

విశ్లేషణ



వి. రాంభూపాల్



అక్షరాస్యత, వైద్య సదుపాయాలు, మౌలిక వసతుల్లో అట్టడుగు స్థానాల నుండి మొదటి ర్యాంకుల్లో ఈ ప్రాంత జిల్లాలు వున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నాటికి వున్న 13 జిల్లాల్లో అత్యంత వెనుకబడిన వాటిలో రాయలసీమ లోని నాలుగు జిల్లాలు వరుసగా కడప జిల్లా 7వ స్థానంలో, చిత్తూరు 9వ స్థానంలో, కర్నూలు 10వ స్థానంలో, అనంతపురం జిల్లా 11వ స్థానంలో వున్నాయి. ఈ వెనుకబాటుకు ప్రధాన కారణాలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి లేకపోవడం. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి అయిన తర్వాత కూడా అనంతపురం జిల్లా వ్యవసాయ భూమిలో 85.39 శాతం, కర్నూలు జిల్లాలో 72.31 శాతం వ్యవసాయ భూమి వర్షంపై ఆధారపడి వుంది. మిగిలిన రెండు జిల్లాల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు.

డిసెంబర్ 5న కర్నూలులో జరిగిన 'రాయలసీమ గర్జన'ను పేరుకి జాయింట్ యాక్షన్ కమిటి నిర్వహించినా, ఆచరణలో అది అధికారపార్టీ సభగా నడిచింది. కర్నూలులో హైకోర్టు పెట్టి న్యాయ రాజధాని చేసి గత వైభవాన్ని తెద్దామనుకుంటుంటే దుష్టశక్తులు అడ్డు కుంటున్నాయని విమర్శించడంతో పాటు, ఎన్ని అడ్డంకులు వచ్చినా న్యాయ రాజధాని నిర్మించి తీరతామని ఇద్దరు సీనియర్ మంత్రులు బల్లగుద్ది మరీ చెప్పారు. జగన్నాథగుట్ట మీద నిర్మించే హైకోర్టు కర్నూలు నలుదిక్కుల పది కిలోమీటర్ల దూరం నుండి ఎటు చూసినా అందరికీ కనిపించేలా కట్టబోతున్నామని ఆర్థికమంత్రి భరోసా ఇచ్చారు. పనిలో పనిగా రాయలసీమకు తెలుగుదేశం హయాంలో జరిగిన అన్యాయాల గురించి విమర్శలు గుప్పించారు. ఈ సభకు రెండు వారాల ముందు ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కర్నూలు జిల్లాలో పర్యటించి తన పాలనలో రాయలసీమకు చేసిన మేలు గురించి చెప్పుకుని, వైసిపి ప్రభుత్వం చేసిన మోసాల గురించి విమర్శలు చేశారు. రెండు పార్టీల విమర్శలను, స్వోత్కర్షలను ఎవరికి అనుకూలంగా వున్న పత్రికలు వారి శక్తి వంచన లేకుండా ప్రాధాన్యత ఇచ్చి ప్రచారం చేశాయి. ఈ రెండు పార్టీల కంటె ముందు ఈ సంవత్సరం మార్చి 18న కడపలో 'రాయలసీమ రణభేరి' నిర్వహించిన బిజెపి వారు...ఈ ప్రాంత వెనుకబాటు, రాష్ట్రంలోని రెండు పార్టీలు చేసిన ద్రోహం గురించి ఏకరువు పెట్టడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి వుందని చెప్పారు. ఈ పార్టీలన్నింటికీ రాయలసీమ మీద ఒకేసారి ఇంత ప్రేమ పుట్టడానికి, ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయం గురించి, ఇక్కడి సమస్యల గురించి మాట్లాడడానికి అసలు కారణం రానున్న ఎన్నికలన్నది జనమెరిగిన సత్యం. అందరూ రాయలసీమను అభివృద్ధి చేసి వుంటే ఎందుకింత వెనుకబడి వుంది?

ఎందుకీ వెనుకబాటు?

ఏ ప్రాంతమైనా అభివృద్ధి కావాలంటే వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగంతో పాటు విద్యా వైద్యం, మౌలిక వసతులు అభివృద్ధి కావాలి. రాయల కాలంలో ఇక్కడ రతనాలు రాశులు పోసి అమ్మారో లేదో కాని నేడు మాత్రం అన్ని రంగాల్లో రాయలసీమ వెనుకబడింది. అక్షరాస్యత, వైద్య సదుపాయాలు, మౌలిక వసతుల్లో అట్టడుగు స్థానాల నుండి మొదటి ర్యాంకుల్లో ఈ ప్రాంత జిల్లాలు వున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నాటికి వున్న 13 జిల్లాల్లో అత్యంత వెనుకబడిన వాటిలో రాయలసీమ లోని నాలుగు జిల్లాలు వరుసగా కడప జిల్లా 7వ స్థానంలో, చిత్తూరు 9వ స్థానంలో, కర్నూలు 10వ స్థానంలో, అనంతపురం జిల్లా 11వ స్థానంలో వున్నాయి. ఈ వెనుకబాటుకు ప్రధాన కారణాలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి లేకపోవడం. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి అయిన తర్వాత కూడా అనంతపురం జిల్లాలో 85.39 శాతం, కర్నూలు జిల్లాలో 72.31 శాతం వ్యవసాయ భూమి వర్షంపై ఆధారపడి వుంది. మిగిలిన రెండు జిల్లాల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు.

ఇన్నేళ్ళ తర్వాత కూడా ఈ ప్రాంతంలోని నాలుగు జిల్లాల్లో వెయ్యి మంది పని చేసే ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమ లేదు. గతంలో వున్న చిన్నపాటి పరిశ్రమలు అనేకం మూతబడ్డాయి. తాడిపత్రిలో ఎన్‌టిసి (నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్), ముద్దనూరులో ఆర్‌టిపిపి, పెనుగొండలో ఆల్విన్ వాచ్ కంపెనీ, గుంతకల్లులో రైల్వే లోకో షెడ్, హిందూపురంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ, గుంతకల్లులో స్పిన్నింగ్ మిల్లు, కర్నూలులో వేలాది మందికి ఉపాధి చూపిన రాయలసీమ పేపర్ మిల్లు, కార్బైడ్ ఫ్యాక్టరీ ఇలా ఒకటేమిటి అనేక పరశ్రమలు మూతబడ్డాయి. కొత్త పరిశ్రమల స్థాపన కోసం చేసిన శంకుస్థాపనల శిలాఫలకాలు పాలకుల నిర్లక్ష్యానికి దిష్టిబొమ్మలుగా వున్నాయి. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో భారీ ఉక్కు పరిశ్రమ, కర్నూలులో రైల్వే కోచ్‌ల నిర్మాణం, చిత్తూరు జిల్లాలో కండలేరు ప్రాజెక్టు నిర్మాణం, అనంతపురం జిల్లాలో ఖుద్రేముఖ్ ఉక్కు పరిశ్రమ లాంటి హామీలన్నీ ఈ ప్రాంతంలోని కార్పొరేట్ కంపెనీల గాలిమరల ధాటికి మాయమయ్యాయి.

చిత్తూరు జిల్లాలో చిత్తూరు-మద్రాసు ఐ.టి కారిడార్, అనంతపురం జిల్లాలో బెంగుళూరు కారిడార్, హర్డ్‌వేర్ పరిశ్రమలు, లేపాక్షి నాలెడ్జ్ హబ్ ఇలా ఎన్నికలు వచ్చినప్పుడుల్లా రకరకాల హామీలు ఇచ్చారు. ఒక్కటంటే ఒక్కటి అమలు చేసిన పాపాన పోలేదు. పెనుకొండ దగ్గర వచ్చిన కియా పరిశ్రమ గురించి పాత, కొత్త పాలకులు జబ్బలు చరుచుకుంటున్నారు. కాని అక్కడ పనిచేస్తున్న కార్మికుల్లో ఈ పరిశ్రమ కోసం భూములు కోల్పోయిన వారిలో ఒక్క శాతం కూడా లేరని, మొత్తం రాయలసీమ జిల్లాలకు చెందిన కార్మికులు పది శాతం లోపేనన్న వాస్తవాన్ని కావాలనే మరుగున పరుస్తున్నారు.

అటకెక్కిన వివిధ కమిటీల నివేదికలు

రాయలసీమ వెనుకబాటుపై ప్రభుత్వాలు అనేక కమిటీలు వేశాయి. ఆ కమిటీలు నివేదికలు ఇచ్చాయి. ఇక్కడి సాగు భూమి సారవంతమైనదని రకరకాల పంటలకు ముఖ్యంగా నాణ్యమైన పండ్ల తోటలకు అనువైన ప్రాంతమని ప్రకటించాయి. అయితే నికరమైన సాగునీటి వనరులు కల్పించడమే అత్యంత ప్రాధాన్యతగా ప్రభుత్వాలు భావించాలని ఈ కమిటీలు చెప్పాయి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నాడు నిర్మించిన తుంగభద్ర హెచ్‌ఎల్‌సి, ఎల్‌ఎల్‌సి, ఆ తర్వాత కె.సి కెనాల్, తెలుగుగంగ, హంద్రీ నీవా...ఇవన్నీ డ్యామ్‌లు కాదు, కాల్వలు. ఇవే ఈ ప్రాంత వ్యవసాయానికి దిక్కు. ఈ కాల్వల నీరు కూడా క్రమంగా సాగునీటి నుండి తప్పుకొని తాగునీటి అవసరాలకు ఉపయోగించే పరిస్థితి దాపురించింది. రాయలసీమ జిల్లాల్లో 64 రకాల ఖనిజ సంపద ఉన్నట్టుగా శాస్త్రీయ సర్వేలు చెబుతున్నాయి. ఇనుము, బైరైట్లు, స్టెలైట్, ఆస్బెస్టాస్, రాగి, వజ్రాలు, కాల్‌సైట్, బంగారం, డోలమైట్...వంటి ఖనిజ సంపదకు కొదవలేదు. కడప, చిత్తూరు జిల్లాల్లో లభించే పులరిన్ ప్రపంచం లోనే అత్యంత అరుదైన ఖనిజం. దీని ధర బంగారం కన్నా 150 రెట్లు అధికం అంటారు. నల్లమల అడవుల్లో దొరుకుతున్న అత్యంత విలువైన ఎరచ్రందనం, శ్రీగంధం, శేషాచలం కొండల్లోను, కదిరి, కుప్పం గుట్టలలోనూ అపారమైన ఖనిజ సంపద రాయలసీమలో వుంది. అత్యంత విలువైన ఔషధ మొక్కలు వున్నాయి. వీటన్నింటిని పరిశీలించిన శ్రీకృష్ణ కమిషన్, ప్రొ॥స్వామినాథన్ ఆధ్వర్యంలోని నిపుణుల బృందం, ప్రొ॥ జయతి ఘోష్ కమిషన్, అనంతపురం జిల్లా అభివృద్ధికి అయ్యప్పన్ కమిషన్ అనేక విలువైన సూచనలు చేశాయి. ఎన్ని అవకాశాలు వున్నా, ఎన్ని కమిటీలు సూచించినా అమలు చేసే పాలకులకు చిత్తశుద్ధి లేకపోతే ఎన్ని వున్నా... ఏం ఉపయోగం అన్నట్లుగా తయారైంది పరిస్థితి.

ఎండమావులవుతున్న పాలకుల హామీలు

తెలుగుదేశం అధికారంలో వున్నప్పుడు నాటి ముఖ్యమంత్రి నవ్యాంధ్ర సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రకటించారు. అందులో రాయలసీమ నాలుగు జిల్లాల అభివృద్ధికి అనేక పథకాలు ప్రకటించారు. వాటిలో కొన్ని... అనంతపురం జిల్లాకు 100 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు, ఎయిమ్స్‌కు అనుబంధ కేంద్రం, స్మార్ట్ సిటీ, టెక్స్‌టైల్ పార్క్, ఎలక్ట్రానిక్ మరియు హార్డ్‌వేర్ క్లస్టర్, విమానాల నిర్వహణ, మరమ్మతుల పరిశ్రమ, కర్నూలుకు నూతన విమానాశ్రయం, ఓర్వకల్లు వద్ద పారిశ్రామిక నగరం, హైదరాబాద్- బెంగుళూరు పారిశ్రామిక కారిడార్, టెక్స్‌టైల్ క్లస్టర్, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, స్విమ్స్ తరహా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రైల్వే వాగిన్ల కర్మాగారం, చిత్తూరు జిల్లా కుప్పంలో ఎయిర్‌పోర్ట్, తిరుపతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, ఐఐటీ, హార్టీకల్చర్ జోన్, మెగా ఫుడ్ పార్క్, ఐ.టి హబ్‌గా తిరుపతి, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ, సిమెంట్ పరిశ్రమలు, ఉర్దూ యూనివర్శిటీ, గార్మెంట్ క్లస్టర్... ఇవన్నీ అమలు చేసి వుంటే లేదా చిత్తశుద్ధితో అమలు చేసేందుకు ప్రయత్నించి వుంటే ఈ రోజు రాయలసీమ వెనుకబాటు గురించి గుండెలు బాదుకోవలసిన అవసరం వుండేది కాదు.

తెలుగుదేశం ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేయకపోవడంతో పాటు, వైసిపి ప్రభుత్వం తమను ఆదుకుంటుందనే ఆశతో రాయలసీమ ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేనంతగా వైసిపి ని దాదాపు ఏకపక్షంగా గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలు షరా మాములైంది. గతంలో సబ్సిడీ ద్వారా రైతులకు అందిన డ్రిప్, స్ప్రింక్లర్లను నిలిపివేసింది. హంద్రీ నీవా రెండు దశలతో పాటు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు తవ్వి నికర సాగునీటి సదుపాయం కల్పిస్తామనే హామీ కనీస అమలుకు నోచుకోకపోగా ఈ నీటి కోసం వాడుతున్న విద్యుత్ బిల్లుల బకాయిలు, నిర్వహణకు నిధులు సక్రమంగా చెల్లిండంలేదు. తానే శంకుస్థాపన చేసిన కడప ఉక్కు పరిశ్రమ అతీగతీ లేకుండా పోయింది. తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు లేవు. కొత్త పరిశ్రమలు లేవు, యువతకు ఉపాధి లేదు. ఈ ప్రాంతంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా వుంది. ఉదా: కృష్ణదేవరాయ యూనివర్శిటీలో 32 డిపార్ట్‌మెంట్లు వుంటే ఎనిమిదింటిలో ఒక్క ప్రొఫెసర్ కూడా లేడు. మరో పదకొండింటిలో ఒక్కరు మాత్రమే వున్నారు. 'లా' విభాగంలో అధ్యాపకులు లేరని, అడ్మిషన్లు నిలిపివేస్తున్నామని యూనివర్శిటీ యాజమాన్యం ప్రకటించింది. ప్రభుత్వ వైద్యంలో మెరుగుదల లేదు. ఇవేవీ చేయకుండా అభివృద్ధి గురించి మాట్లాడి మరలా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. అధికార వికేంద్రీకరణ జరగాలి. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి. అది ఒక్కటే ఈ ప్రాంత అభివృద్ధికి సరిపోదు. ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలి.

ప్రజా పోరాటమే మార్గం

విభజన చట్టంలో భాగంగా ఈ ప్రాంతానికి నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయని కేంద్ర బిజెపి పాలకులను ప్రశ్నించాలి. 2015 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో శంకుస్థాపన చేసిన బెల్, నాసెన్ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కేంద్రీయ విశ్వవిద్యాలయం, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజి అమలు కోసం కేంద్ర పాలకులను నిలదీయకుండా రాయలసీమను ఎలా అభివృద్ధి చేస్తారు. ఎన్నికల ముందు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడి సున్నితమైన అంశాలను ఎన్నికల ప్రయోజనాల కోసం రెచ్చగొట్టి మరో విభజన వాదానికి పునాదులు వేసే చర్యలను ప్రజలు చైతన్యంతో ఎదుర్కోవాలి. పాలకుల మోసాలను ప్రశ్నించాలి. ప్రజా పోరాటాల ద్వారా రాయలసీమ అభివృద్ధిని సాధించుకోవాలి.


(వ్యాసకర్త :సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యుడు)

అమెరికా సబ్సిడీలు - ఐరోపాతో వాణిజ్య పోరు!

అంతర్జాతీయం



ఎం. కోటేశ్వరరావు



ఉక్రెయిన్ రక్షణ పేరుతో రష్యా మీద ఆంక్షలు, ఆయుధాలతో ఉమ్మడిగా పోరుచేస్తున్న అమెరికా - ఐరోపా సమాఖ్య మధ్య అమెరికా సబ్సిడీలు కొత్త వాణిజ్య పోరుకు నాంది కానున్నాయా అన్న చర్చ ఇప్పుడు జరుగుతోంది. ఈ రాయితీలు ప్రధానంగా జర్మనీ, ఫ్రెంచి కార్ల కంపెనీలకు ముప్పుగా కనిపించటంతో ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ కంటికి కన్ను పంటికి పన్ను అన్నట్లుగా మాట్లాడుతున్నాడు. జర్మనీ కాస్త ఆచితూచి స్పందిస్తున్నది. ఉక్రెయిన్ పోరులో అన్ని రకాలుగా అమెరికాకు లబ్ధి, తమకు ఇబ్బందులా అన్న ఉక్రోషం ఇప్పటికే ఐరోపాలో ప్రారంభమైంది. దాన్ని మరింతగా పెంచేదిగా తాజా పరిణామాలున్నాయి. అమెరికాలో తయారైన ఉత్పత్తులకు పెద్ద ఎత్తున అక్కడి ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ, పన్ను రాయితీల గురించి ఐరోపా సమాఖ్య ఒక్కటిగా ఉండాలని తొలిసారిగా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్సులా వాండర్ లెయన్ పిలుపునిచ్చారు.అనుచిత పోటీకి దారితీసి మార్కెట్ల మూత, సరఫరా గొలుసుల విచ్ఛిన్నానికి దారి తీస్తుందని ఉర్సులా అన్నారు. నిజానికి ఆమె ఐరోపాలో అమెరికా అనుకూల నేత, అంతరంగంలో ఏమున్నప్పటికీ ఐరోపాలో తలెత్తిన ఆందోళనను ప్రతిబింబించే విధంగా ఆమె మాట్లాడాల్సి వచ్చింది.

ద్రవ్యోల్బణం తగ్గింపు చట్టం (ఐఆర్ఏ) పేరుతో జో బైడెన్ సర్కార్ 430 బిలియన్ డాలర్ల పథకాన్ని ప్రకటించింది. దీనిలో అమెరికాలో తయారైన వస్తువులను కొనుగోలు చేసే వారికి రాయితీలు ఇస్తారు. ఇది అక్కడి కంపెనీలకు ఇచ్చినట్లే. ఈ పథకం అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకున్న కెనడా, మెక్సికో దేశాలకు కూడా వర్తిస్తుంది. మరోవైపు తమ కంపెనీలకు నష్టదాయకమని ఐరోపా సమాఖ్య ఆందోళన వెల్లడించింది. అమెరికాకు ప్రతిగా సమాఖ్య కూడా తన స్వంత నిబంధనలను సరి చేసుకొని అమెరికాకు పోటీగా చర్యలు తీసుకోవాలని ఉర్సులా సూచించారు. అమెరికా ఐఆర్ఏ చట్టం గురించి ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఓ)కు ఫిర్యాదు చేయాలని ఐరోపా పార్లమెంటు వాణిజ్య కమిటీ అధిపతి బెరెండ్ లాంగే అన్నాడు. అమెరికా ఇప్పటికే చట్టాన్ని ఆమోదించినందున పెద్దగా ఒరిగేదేమీ ఉండదని కూడా అన్నట్లు వార్తలు. ద్రవ్యోల్బణం తగ్గింపు చట్టం పేరుతో ఇస్తున్న సబ్సిడీ నిజానికి పోటీదార్లను బలహీనపరిచేందుకు తప్ప మరొకటి కాదు. ఇదే విధంగా అమెరికా చిప్స్ చట్టం పేరుతో తీసుకున్న చర్య తన స్వంత సెమికండక్టర్ పరిశ్రమ రక్షణ కోసమే.

అమెరికా ప్రకటించిన సబ్సిడీల మొత్తం అమెరికాలో ఉత్పత్తి అయిన వాటికి ఇవ్వటం డబ్ల్యుటిఓ నిబంధనలకు విరుద్ధమని, దానితో తాము పోటీ పడలేమని 27 దేశాల ఐరోపా సమాఖ్య అంటోంది. అమెరికా సబ్సిడీలు మహా కలహాశీలమైనవి, పశ్చిమ దేశాలను విడదీస్తాయని ఫ్రెంచి అధినేత మక్రాన్ వాషింగ్టన్ పర్యటనలోనే తన అసమ్మతిని వెళ్లగక్కాడు. మరోవైపున ఐఆర్ఏలో ఎలాంటి మార్పులు చేసేది లేదని అధికార డెమోక్రాట్లు స్పష్టం చేశారు. లోపల ఏం ఉన్నప్పటికీ సబ్సిడీల వివాదాన్ని అట్లాంటిక్ వ్యాపిత దేశాల వాణిజ్య వివాదంగా మార్చకుండా చూడాలని మక్రాన్-జో బైడెన్ ప్రకటించారు. అమెరికా సబ్సిడీలకు ఐరోపా నుంచి గట్టి స్పందన ఉండాలని జర్మనీ ఆర్థిక మంత్రి రాబర్ట్ హెబెక్ అన్నాడు. జర్మనీ విత్త మంత్రి క్రిస్టియన్ లిండ్‌నెర్ స్పందిస్తూ అమెరికాతో వాణిజ్య పోరుకు సిద్ధపడాలన్నాడు. తమ వాణిజ్య ప్రయోజనాల రక్షణకు ఆర్థిక దౌత్యం మీద ఆధారపడాలని కూడా చెప్పాడు. ఎవరి వైఖరికి వారు కట్టుబడి ఉన్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో అమెరికా-ఐరోపా ప్రతినిధులు టెక్ సహకారం గురించి చర్చలు జరపనున్నారు. ఈ చర్చల్లో సబ్సిడీల గురించి తేలేదేమీ ఉండదు గనుక ఐరోపా తన పరిశ్రమకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధం కావాలని ఐరోపా పార్లమెంటు వాణిజ్య కమిటీ అధిపతి బెరెండ్ లాంగే అన్నాడు. అమెరికాకు ప్రతిగా ఇతర దేశాలు కూడా కొన్ని ప్రతికూల చర్యలు తీసుకోకపోలేదు. నిజంగా విభేదాలు ముదిరితే ఇలాంటి వాటిని చూపి అమెరికా ఎదురుదాడికి దిగవచ్చు.

అమెరికా-ఐరోపా మధ్య వాణిజ్య పోరు జరిగే అవకాశాలున్నాయనే ఆందోళన పెరుగుతోందని, ఈ పూర్వరంగంలో తాము మూల్యం చెల్లిస్తూ అమెరికా పెత్తనానికి తలవంచి అనుసరించటం కంటే తమ ప్రయోజనాల రక్షణకు స్వంత నిర్ణయాలు తీసుకోవటం మంచిదని చైనా విశ్లేషకులు ఐరోపాకు సూచించారు. ప్రస్తుతం ఐరోపా నేతలు అటు అమెరికా ఇటు చైనాతోను సంబంధాలను కొనసాగిస్తున్నారు. చైనాతో విడగొట్టుకోవాలని అమెరికా నిరంతరం ఇతర దేశాలకు చెబుతోంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మక్రాన్ జనవరిలో చైనా రానున్నాడు. ఎలక్ట్రిక్ వాహనాలు, క్లీన్ ఎనర్జీకి అమెరికా ఇస్తున్న భారీ సబ్సిడీల కారణంగా పెట్టుబడులు ఐరోపా నుంచి అమెరికాకు తరలుతాయని భావిస్తున్నారు. అందుకే ప్రతి ఐరోపా నేత వాటి గురించి ఆందోళన వెల్లడిస్తున్నారు.

ప్రపంచ వాణిజ్య సంస్థలో కేసు దాఖలు చేస్తే అది ఎంత కాలానికి తేలుతుందో, ఏ తీర్పు వస్తుందో అన్న అనుమానాలు కూడా ఐరోపాలో ఉన్నాయి. దెబ్బకు దెబ్బ అన్నట్లుగా మనం కూడా సబ్సిడీలు ఇద్దామని మక్రాన్ అంటున్నాడు. ఐతే ఈ చర్య ఐరోపా అంతర్గత మార్కెట్‌ను దెబ్బ తీస్తే సమాఖ్య వాటిని తిరస్కరించే అవకాశం ఉంది. ఉమ్మడి పారిశ్రామిక విధానంతో పాటు సబ్సిడీలు ఇచ్చేందుకు కూడా ఉమ్మడి నిధి అవసరం, దాని కోసం అప్పు తేవాలి లేదా దేశాలన్నీ నిధులు సమకూర్చాలి. ఇప్పుడున్న స్థితిలో దాన్ని ఏమేరకు అంగీకరించేది అనుమానమే. కావాలంటే ఐరోపా కూడా పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇస్తే తాము ఇస్తున్నదానికి సరితూగవచ్చని అమెరికా వాణిజ్య కాథరీన్ తాయి సలహా ఇచ్చారు. అలా ఇవ్వగలిగిన అవకాశం జర్మనీకే ఉంది. ఒకవేళ ఇస్తే ఒకే మార్కెట్ అన్న ఐరోపా సమాఖ్య లక్ష్యానికే ఎసరు వస్తుంది. చిన్న దేశాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే పెరిగిన ఇంధన ధరల నుంచి గృహాలు, వాణిజ్య సంస్థలకు ఉపశమనం కలిగించేందుకు జర్మన్ ప్రభుత్వం ముందుకు తెచ్చిన 206 బిలియన్ డాలర్ల సబ్సిడీ పథకం మీద మిగతా దేశాలు గుర్రుగా ఉన్నాయి.

ఐరోపా కార్పొరేట్ల లబ్ధి ప్రధానంగా రష్యా నుంచి చౌకగా వచ్చే ఇంధనం, చైనా నుంచి వస్తువుల మీద ఆధారపడి ఉంది. అమెరికాకు తోకగా మారి నడుస్తున్న కారణంగా ఇప్పుడు రష్యా నుంచి ఇంధనం నిలిచి ధరలు విపరీతంగా ధరలు పెరిగాయి. పరిశ్రమలకు ముప్పు వచ్చింది. దీనికి అమెరికా సబ్సిడీలు తోడైతే ఐరోపా పరిశ్రమల భవిష్యత్ సందిగ్ధంలో పడుతుంది. ఇప్పటికే అక్కడ ఇంధన ధరలు విపరీతంగా పెరగటంతో అనేక మంది ఐరోపా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలు తమ స్వంత దేశాల్లో బదులు అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గు చూపుతున్నారు. వారికి కావాల్సింది లాభాలు తప్ప మరొకటి కాదు. ఈ స్థితిలో అమెరికా మాట నమ్మి చైనాతో కూడా తెగతెంపులు చేసుకొంటే ఇబ్బంది పడేది ఐరోపా దేశాలే. అందువలన అది జరగకపోవచ్చు. అమెరికా-ఐరోపా మధ్య దూరం పెరిగే అవకాశాలు వస్తే చైనా దాన్ని వదులుకోదన్నది తెలిసిందే.

ఇతర దేశాల సబ్సిడీల గురించి వివిధ రకాలుగా నానా గొడవ చేస్తున్నది అమెరికా, ఐరోపా దేశాలు. పలు రకాలుగా వాటిని అదుపు చేస్తూ తమ మార్కెట్‌ను కాపాడుకుంటున్నాయి. ఇప్పుడు అమెరికా జాతీయవాదం, రక్షణాత్మక చర్యలకు దిగింది. అమెరికాకు అగ్రస్థానం అన్న విధానానికి డోనాల్డ్ ట్రంప్ తెర తీస్తే జో బైడెన్ దాన్ని కొనసాగిస్తున్నాడు. దీన్ని ఎదుర్కొనేందుకు ఐరోపా వద్ద ఎక్కువ అస్త్రాలు లేవు. తొలుత చర్చలతో ప్రారంభించి కుదరకపోతే ప్రపంచ వాణిజ్య సంస్థను ఆశ్రయించవచ్చు. వాటితో అమెరికా కొంత మేర దిగిరావచ్చు లేదా ససేమిరా అంటే నీవు నేర్పిన విద్యే అన్నట్లుగా ఐరోపా కూడా సబ్సిడీలు ప్రారంభించటం, అమెరికా వస్తువులపై పరిమితులు విధింపు వంటి పనులకు పూనుకోవచ్చు. ఇప్పుడున్న ప్రపంచ పరిస్థితిలో అమెరికా తెగేదాకా లాగుతుందా? చైనా, రష్యాలను అదుపు చేసేందుకు దానికి ఐరోపా అవసరం. అందువలన ఇతరంగా దానికి లబ్ధి చేకూర్చేందుకు పూనుకుంటుందా? కొందరు ఐరోపా నేతలు, పెద్దల్లో అమెరికా గురించి ఇంకా భ్రమలు ఉన్నాయి. ఉక్రెయిన్ సంక్షోభంతో ఇంధన సరఫరాకు ఇబ్బందులు, ధరల పెరుగుదలతో ఇప్పటికే ఐరోపా అతలాకుతలం అవుతున్నందున ఇప్పుడు అమెరికా సబ్సిడీలతో తన పరిశ్రమలను కూడా దెబ్బతీస్తే జనం ఊరుకుంటారా? ఐరోపా సమాఖ్య ఒకటిగా ఉన్నట్లు కనిపిస్తున్నా అన్ని దేశాలు ఒకే విధంగా లేవు. అమెరికాతో రాజీకి కొన్ని సుముఖంగా, మరికొన్ని స్వతంత్ర వైఖరితో ఉండాలని కోరుకుంటున్నాయి. జర్మనీ, ఫ్రాన్సు వంటి దేశాలు అవసరమైతే తాము చైనాకు దగ్గర అవుతామనే సంకేతాలను పంపటం అమెరికా నుంచి మరిన్ని రాయితీలు పొందేందుకే అన్నది స్పష్టం. ★

జనవాక్యం

ఇది కదా కథ

బువ్వ తినరా బిడ్డా...అంటూ అమ్మలు చెప్పే ఎన్నో రకాల కథలను మదిన నింపుకొని ఎదుగుతారు పిల్లలు. కానీ అసలు తినే బువ్వ ఎట్లా పుట్టిందో కథలుగా వారికి చెప్పరు కదా. గింజలెట్లా మొలిచెనో అవి మెతుకులై మన బతుకులెట్లా మలిచెనో మన కుల మతమేదైనా కమతము చరిత, కర్షకుని ఘనత తెలుసుకోవాలి కదా. తన వెన్ను వంచి మన్ను దున్ని తన చెమట చుక్కలతో రెక్కల కష్టంతో మనకు డొక్కల నిండుగా అన్నమెట్టిన అన్నదాత శ్రమను తలచుకోవాలి కదా. నింగికి నేలకు లగ్గమెట్టి, కాడి మేడి జతచేసి ఏరువాక జాతర చేసి, నాగళ్ల తోటి బీళ్ళు సాళ్లు చేసి, మేలైన బీజమేసి, నీరుపోసి వరి నారుపెంచు పొలమరి ఎంత సొగసరో అని స్మరించుకోవాలి కదా. చీడ పీడల మీద పోరు చేసి తన ఒడలు అలసి పోయినా బిడ్డల మాదిరి సాకి పైరు ఎదగడానికి వూత మిచ్చే వ్యవసాయి ఎంతటి వీరుడో గ్రహించుకోవాలి కదా. మన్నుతో మనసు కలిపి పొలముతో చెలిమి చేసి ప్రాణము పణముగా పెట్టి విపత్తులకు ఎదురొడ్డి గింజ గింజను అక్కున జేర్చుకొని విపణి కష్టాలను దాటి పంటను ఇంటికి చేర్చి పండుగను మాత్రం జనులకు ఇచ్చే ఆ కాపు ఎంతటి ఘనుడో అని కీర్తించాలి కదా. చరిత అంటే గతం కానీ మన్నును అన్నంగా మలచటానికి పొలముపై హలము రాసే హాలికుని చరిత వర్తమానం ఎప్పటికీ నిత్య నూతనం. విధాత నమ్మకం అని... అన్నదాత నిజం అని చెప్పాలి కదా కథగా . పిల్లలకి చెప్పాల్సింది ఇదే కదా.

- ఆచంటి శ్రీనివాసరావు, తెనాలి.

కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలి

- రామ్‌లీలా మైదానంలో ఇపిఎస్ పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలని ఇపిఎస్ పెన్షనర్లు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. బుధవారం నాడిక్కడ రామ్‌లీలా మైదానంలో ఇపిఎస్ పెన్షనర్లు ఆందోళన చేపట్టారు. ఈ ధర్నాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, గోవాపా పలు రాష్ట్రాల పెన్షనర్లు పాల్గొన్నారు. హైయ్యర్ పెన్షన్ అందరికీ అమలు చేయాలని, భార్యాభర్తలకు మెడికల్ సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. పెన్షనర్ల కోఆర్డినేషన్ కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ధర్మజన్, ఆంధ్రప్రదేశ్ నుండి అధ్యక్ష, కార్యదర్శులు శాస్త్రి, సుధాకర్ తదితరులు మాట్లాడారు.

నోట్లరద్దుపై సుప్రీం తీర్పు రిజర్వ్

ఆర్థిక క్రతం నాటి నోట్ల రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ ముగించింది. తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేస్తూ 2016లో తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. ఈ పిటిషన్లపై వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్‌లో పెట్టింది.

బీజింగ్‌లో ఆంక్షల సడలింపు

బీజింగ్ : కోవిడ్ కేసులు తగ్గుతున్న నేపథ్యంలో చైనా రాజధాని బీజింగ్‌లో కోవిడ్ ఆంక్షలను తొలగించారు. కార్యాలయాలు, భవనాలు, పార్కులు, సూపర్ మార్కెట్‌ల్లోకి ఎలాంటి పరీక్షలూ లేకుండా స్వేచ్ఛగా ప్రవేశించవచ్చునని అధికారులు తెలిపారు.

ప్రతిపక్షాలకూ సమాన అవకాశం

- రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖర్‌కు ప్రతిపక్షాల సూచన
- ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తారు : ప్రధాని మోడీ
- లోక్‌సభలో కృష్ణకు నివాళి



అభినందనలు తెలుపుతున్న మోడీ, అభివాదం చేస్తున్న ధన్‌ఖర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ ఛైర్మన్‌గా ప్రతిపక్షాల వైపు కూడా చూడాలని జగదీప్ ధన్‌ఖర్‌కు ప్రతిపక్ష నేతలు సూచించారు. రాజ్యసభ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి మొదటి రోజు రాజ్యసభకు వచ్చిన జగదీప్ ధన్‌ఖర్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గేతోపాటు అన్ని పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీ మాట్లాడుతూ రాజ్యసభకు ఛైర్మన్‌గా ఉన్న తమను ఛైర్మన్‌ని అభినందిస్తున్నానని చెప్పారు. పోరాటాల మధ్య ధన్‌ఖర్ ఈ దశకు చేరుకున్నారని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తారని అన్నారు. రైతు కుటుంబానికి చెందిన ధన్‌ఖర్ సైనిక్ స్కూల్‌లో చదివారని, అందువల్ల జవాన్లు, రైతులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. జగదీప్ ధన్‌ఖర్ చట్టపరమైన విషయాలపై కూడా మంచి అవగాహన ఉందని అన్నారు. దేశానికి రాజ్యసభ అతిపెద్ద బలమని, మన ప్రధానులు చాలామంది రాజ్యసభ సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ దేశంలో రెండో అతిపెద్ద రాజ్యాంగ పదవికి బాధ్యత వహించినందుకు ప్రతిపక్ష సభ్యుల తరఫున అభినందిస్తున్నానని తెలిపారు. రాజ్యసభను ఆలోచనల గది అని, చర్చల్లో ప్రతిపక్షాలకు కూడా తగిన సమయం ఇవ్వాలని కోరారు. మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ మాట్లాడుతూ20 ఏళ్లగా ఈ సభలో మంచి అనుభవం ఉన్న ఏకైక సభ్యుడిని తానేనని, తనకు మాట్లాడే అవకాశం రావడం చాలా సంతోషం అన్నారు.

ప్రజాస్వామ్య పద్ధతుల్లో సభను నడపాలి : కరీం

సిపిఎం ఎంపి ఎలమరం కరీం మాట్లాడుతూ సభను పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో నడపాలని, అప్పుడే సభకు అంతరాయం కలగదని అన్నారు. ప్రజా సమస్యలను సభలో ప్రతిబింబించడమే నిజమైన ప్రజాస్వామ్యమని పేర్కొన్నారు. రాజ్యాంగ విధానం, ప్రజాస్వామ్య సూత్రాలను సమర్థించాలని సూచించారు. సభలో పార్టీలకు ఉన్న సభ్యులను బట్టి సమయం ఇవ్వడం సమర్థనీయం కాదని, అన్ని పార్టీలకు, స్వతంత్రులకు సమాన అవకాశం ఇవ్వాలని కోరారు. ఛైర్మన్ సహకరించాలని, ఛైర్మన్ స్థాయిని తగ్గించకూడదని అధికార పార్టీకి సూచించారు. వైసిపి నుంచి అయోధ్య రామిరెడ్డి, టిడిపి నుంచి కనకమేడల రవీంద్ర కుమార్, టిఆర్ఎస్ నుంచి కె.కేశవరావు మాట్లాడారు. అనంతరం ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మాట్లాడుతూ నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిషన్ (ఎన్‌జెఎసి) చట్టాన్ని కొట్టేస్తూ 2015లో కోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు. ఇది పార్లమెంటరీ సార్వభౌమాధికారాన్ని, ప్రజల ఆదేశాన్ని విస్మరించడానికి ఉదాహరణ అని అన్నారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు సమిష్టిగా పనిచేస్తే మంచిదని తెలిపారు.

ములాయం, కృష్ణకు నివాళి

రాజ్యసభలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ వైల్డ్ లైఫ్ (రక్షణ) సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై అన్ని పార్టీల ప్రతినిధులు చర్చించిన తరువాత, మిగతా చర్చను గురువారం కొనసాగిస్తారు. రాజ్యసభలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, లోక్‌సభలో కేంద్ర విదేశాంగ సహాయ మంత్రి మీనాక్షి లేఖి విదేశీ విధానంపై ప్రకటన చేశారు. ఇటీవల మరణించిన ఎస్‌పి అధినేత ములాయం సింగ్ యాదవ్, ప్రముఖ తెలుగు నటుడు, మాజీ ఎంపి ఘట్టమనేని కృష్ణ తదితరులకు లోక్‌సభలో నివాళులర్పించారు. గంటపాటు లోక్‌సభను వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీస్ (సవరణ) బిల్లును కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి బిఎల్ వర్మ ప్రవేశపెట్టారు. ఈ బిల్లును సిపిఎం ఎంపి ఎఎం ఆరిఫ్, కాంగ్రెస్ ఎంపిలు అధిర్ రంజన్ చౌదరి, మనీష్ తివారీ, ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్, టిఎంసి ఎంపి సౌగత్ రాయ్, డిఎంకె ఎంపి టిఆర్ బాలు తదితరులు వ్యతిరేకించారు. అనంతరం మంత్రి ఎస్ జైశంకర్ యాంటీ మారిటైమ్ పైరసీ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై అన్ని పార్టీల ఎంపిలు చర్చించారు.

విజయసాయి తొలగింపు

రాజ్యసభ ప్యానల్ వైస్ ఛైర్మన్ల జాబితా నుంచి వైసిపి పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయి రెడ్డి పేరును తొలగించారు. ఇంతకుముందున్న జాబితా నుంచి వందనా చౌహాన్, విజయసాయిరెడ్డి, ఇందుబాల గోస్వామి పేర్లు తొలగించారు.

నేడు గుజరాత్, హిమాచల్ ఫలితాలు

న్యూఢిల్లీ : గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గురువారం ప్రకటించనున్నారు. ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. 8 గంటలకు ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుంది. 8:30 గంటల నుంచి ఇవిఎం కౌంటింగ్ ప్రారంభం అవుతుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వీడియో తీయనున్నారు. గుజరాత్‌లో మొత్తంగా 37 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగనుంది. హిమాచల్ ప్రదేశ్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 59 ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు జరగనుంది. కౌంటింగ్ కేంద్రాల్లో కనిష్టంగా 8, గరిష్టంగా 14 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్‌కు ప్రత్యేకంగా టేబుల్ ఏర్పాటు చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో నవంబర్ 12, గుజరాత్‌లో డిసెంబరు 1, 5 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. గుజరాత్‌లో 182 అసెంబ్లీ స్థానాలు, హిమాచల్ ప్రదేశ్‌లో 68 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

ఐక్య పోరాటాలతో విలీనం నిలిపివేత

అంగన్‌వాడీ పదో మహాసభ చర్చల్లో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు



ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అంగన్‌వాడీ పోరాటాలపై మాట్లాడుతున్న అన్నపూర్ణ, చంద్రావతి

మధురై : అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేయాలన్న నిర్ణయాన్ని కార్యకర్తల పోరాటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాత్కాలికంగా విరమించిందని రాష్ట్ర ప్రతినిధులు తెలిపారు. మధురైలోని ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్) 10వ మహాసభలో రెండోరోజైన బుధవారం కార్యదర్శి నివేదికపై చర్చ జరిగింది.

చర్చల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి హాజరైన అన్నపూర్ణ, చంద్రావతి ఐసిడిఎస్‌లో జరుగుతున్న మార్పులు, పోరాటాల గురించి వివరించారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల్లో కలిపివేయాలని నిర్ణయించగా, యూనియన్ తీవ్రంగా పోరాడటంతో ఈ నిర్ణయాన్ని తాత్కాలికంగా వెనక్కుతీసుకున్నారు. అయితే ఉత్తర్వులను రద్దు చేయలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టారు. దీనిని అమలు చేసే ప్రథమ్ ఫౌండేషన్ ఇంగ్లీష్ మీడియం పాఠాలను వీడియోలుగా తీస్తామని చెప్పినా, తీయలేదు. కేంద్రాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. కేంద్రాల తనిఖీల పేరుతో అంగన్‌వాడీలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రాజకీయ నాయకులు, ఫుడ్ కమిషనర్లు కేంద్రాలను తనిఖీ చేసి మెమోలు ఇస్తున్నారు. ప్రీస్కూల్ మేనేజ్‌మెంట్, సిలబస్ ప్రస్తుతం బైజూస్, ప్రథమ సంస్థల నియంత్రణలో ఉంది. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణలో పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచలేదు.

ట్రావెల్ అలవెన్స్ బిల్లును కూడా పెంచలేదు. దీంతో అనేక మంది అంగన్‌వాడీలు అప్పుల్లో కూరుకుపోయారు. ఫోన్లను కూడా ఇవ్వలేదు. వాట్సప్‌లో ఫోటోల అప్‌లోడ్ కోసం అంగన్‌వాడీలు సొంతంగా ఫోన్లు కొనుక్కుని ఉపయోగించాల్సి వస్తోంది' అని వివరించారు.

బిగ్ సిలో 20వ వార్షికోత్సవ ఆఫర్లు

హైదరాబాద్ : ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ సి 20వ వార్షికోత్సవం సందర్భంగా పలు ఆకర్షణీయ ఆఫర్లను ప్రకటించింది. ఈ భారీ ఆఫర్లు డిసెంబర్ 3 నుంచి 2023 జనవరి 29 వరకు అందుబాటులో ఉంటాయని బిగ్ సి వ్యవస్థాపకులు, సిఎండి యం బాలు చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. తమ వద్ద స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ టివి, ల్యాప్ టాప్ కొనుగోలు చేసిన ఖాతాదారులకు లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు 20 కార్లు, 20 బైకులు, 20 ఎసిలు, 20 రిఫ్రిజిరేటర్లు, 20 టివిలు బహుమతిగా ఇస్తామని ఆయన తెలిపారు. వీటితో పాటు ప్రతీ మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి, 10 శాతం వరకు క్యాష్ బ్యాక్, సులభ వాయిదాల పద్ధతిలో చెల్లింపులు, డౌన్ పేమెంట్ లేకుండా మొబైల్ కొనుగోలు సౌకర్యం కల్పించనున్నామన్నారు. బ్రాండ్ అస్సెస్సరీస్‌పై 51 శాతం వరకు రాయితీ, పలు బ్రాండెడ్ మొబైల్ ఫోన్లపై రూ.10,000 వరకు క్యాష్ బ్యాక్‌ను అందిస్తున్నామన్నారు.

10 లక్షలకుపైగా ఉద్యోగాలు ఖాళీ

- రైల్వేలోనే 2,93,943 ఖాళీలు
- రక్షణ రంగంలో 2,64,706, హోం శాఖలో 1,43,536 పోస్టులు ఖాళీ
- లోక్‌సభలో కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్లలో 10 లక్షలకుపైగానే ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. 2021 మార్చి 1 నాటికి 78 కేంద్ర మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్లలో 9,79,327 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇందులో అత్యధికంగా రైల్వేలో 2,93,943 పోస్టులు, రక్షణ రంగంలో 2,64,706 పోస్టులు, కేంద్ర హోం శాఖలో 1,43,536 పోస్టులు, పోస్టల్‌లో 90,050 పోస్టులు, రెవెన్యూలో 80,243 పోస్టులు, ఇండియన్ ఆడిట్, అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ లో 25,934 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 40,35,203 పోస్టులకు గానూ, దాదాపు పది లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు స్పష్టమైంది. ఏడాదిన్నర కిందటి సమాచారమిది. ఈ కాలంలో మరిన్ని ఖాళీలు ఏర్పడ్డాయి.

చేనేతకు జిఎస్‌టి 12% పెంపు నిర్ణయం వాయిదా

చేనేతకు జిఎస్‌టి 5 శాతం నుంచి 12 శాతానికి పెంచాలనే 46వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం వాయిదా పడిందని, ప్రస్తుతం 5 శాతమే కొనసాగుతోందని కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి దర్శన్ జర్దోష్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అందువల్ల గార్మెంట్స్, బట్టలపై 5 శాతం జిఎస్‌టినే కొనసాగుతోందని తెలిపారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రుణాలకు సగటు వడ్డీ 8.34 శాతం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ తీసుకున్న రుణాలకు సగటు వడ్డీ 8.34 శాతం ఉందని కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే తెలిపారు. టిడిపి ఎంపి రామ్మోహన్ నాయుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర స్టీల్ సహాయ మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ఏపి ఎంపి, ఎమ్మెల్యేలపై 10 సిబిఐ కేసులు

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపి, ఎమ్మెల్యేలపై పది సిబిఐ కేసులు నమోదయ్యాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. వైసిపి, టిడిపి, జనసేనకు చెందిన వారిపై ఈ కేసులు ఉన్నాయని తెలిపారు. బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2017 నుంచి 2022 (2022 అక్టోబర్ 31) వరకు దేశంలోని 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపి, ఎమ్మెల్యేలపై 56 సిబిఐ కేసులు నమోదయ్యాయని, అందులో అత్యధికంగా ఏపికి చెందిన ఎంపి, ఎమ్మెల్యేపైనే పది కేసులు నమోదయ్యాయని తెలిపారు. 56 కేసుల్లో ఇప్పటికే 22 కేసులకు సంబంధించి చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

భేటీ పడావో ప్రకటనల ఖర్చు రూ.401 కోట్లు బాలికలకు ఖర్చు చేసింది రూ.373 కోట్లే

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భేటీ పడావో కార్యక్రమం ప్రకటనలకు రూ.401.04 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2014-15 నుంచి ఇప్పటి వరకు భేటీ పడావో కార్యక్రమానికి రూ.1,270 కోట్లు కేటాయించగా, అందులో రూ.774.25 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఖర్చు చేసిన మొత్తంలో రూ.373.21 కోట్లు బాలికల కార్యక్రమాలకు ఖర్చు చేసినట్లు తెలిపారు.

క్రైస్తవ, ముస్లిం మతాల్లోని దళితులకు ఎస్‌సి రిజర్వేషన్లు కల్పించం

- సుప్రీంలో కేంద్రం : రంగనాథమిశ్రా నివేదిక లోపభూయిష్టమని వాదన

న్యూఢిల్లీ : క్రైస్తవ, ముస్లిం మతాలు అనుసరిస్తున్న దళితులకు ఎస్‌సి రిజర్వేషన్లు కల్పించేందుకు వ్యతిరేకమని సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ముందు కేంద్రప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. హిందూ మతం నుంచి ఇతర మతాల్లోకి మారిన దళితులకు ఎస్‌సి రిజర్వేషన్లు కల్పించాలని 2007లో జస్టిస్ రంగనాథమిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను అంగీకరించబోమని తుషార్ మెహతా పేర్కొన్నారు. ఆ నివేదికను నాలుగు గోడల మధ్య రూపొందించారని, ఫీల్డ్ స్టడీ చేయలేదని విమర్శించారు. ముస్లిం, క్రైస్తవ మతాల్లో కుల వ్యవస్థ లేదని పేర్కొన్నారు. క్రైస్తవ మతం సమానత్వ మతమని, అది ఏ కుల వ్యవస్థకు కట్టుబడదని పేర్కొన్నారు. క్రైస్తవం, ఇస్లాంలో అంటరానితనం తీవ్రంగా లేదని అన్నారు. అందువల్ల ఆయా మతాల్లోకి మారడం ద్వారా సామాజిక స్థితిని మెరుగుపరుచుకున్న తర్వాత హిందూమతంలో అంటరానితనం ఆధారంగా కల్పించిన రిజర్వేషన్లను పొందలేరని వాదించారు. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోకి కాకుండా ఇతర మతాల్లోకి వెళ్లిన వారికి ఎస్‌సి రిజర్వేషన్లు ఇచ్చే అంశంపై ఇటీవల సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కెజి బాలకృష్ణన్ నేతృత్వంలో కమిషన్ నియమించామని, ఆ నివేదిక వచ్చే వరకూ వేచి ఉండాలని కోరారు. బాలకృష్ణన్ కమిషన్ నివేదిక కోసం వేచి ఉండాలా? దళితులు ఇతర మతాలు, ప్రధానంగా క్రైస్తవంలోకి మారిన వారికి ఎస్‌సి కోటా ప్రయోజనాలను కల్పించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లను విచారించాలా? అనే అంశాలను పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది.



మీకోసం

చెప్పులు, బూట్లు కరుస్తుంటే ఆ భాగానికి పెరుగు రాసి రాత్రంతా ఉంచి తెల్లారి ఎండిన పెరుగును దులిపి ధరించాలి. అప్పడవి కాస్త వదులై, సున్నితంగా మారతాయి.

జీవన సౌరభం


తనకు ఇష్టమైన పనిని మూర్ఖుడు కూడా చేయగలడు. బుద్ధిమంతుడు మాత్రం తాను చేస్తున్న పనిని తనకు ఇష్టమైన పనిగా మార్చుకుంటాడు.

మా పల్లె

చక్కని పంట పొలాలతో మా పల్లె
పచ్చని సువాసన విరజిల్లే
రంగు పూలతో మా పల్లె
అందంతో సొగసిల్లే
పచ్చని రంగులతో ఆ చెట్లు
మా ప్రాణవాయువుకు జీవనమెట్లు
పుల్లటి రుచితో ఆ చింత
చిగురుని తింటే పులకింత
నీలపు రంగుతో ఆ చెరువు
పశుపక్ష్యాదులకు ఆదరువు
తుమ్మచెట్టుకు వేళ్లాడే ఆ గూళ్ళు
చిన్ని పిట్టల పెద్ద తెలివికి నకళ్లు
వరసల అనుబంధాలతో మా పల్లె
అందాల హరివిల్లయి విలసిల్లె ..!



- సి.హెచ్.అలేఖ్యా రెడ్డి ,
10వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
ఇందిరా నగర్, సిద్ధిపేట.



లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 121

నేను గీసిన బొమ్మ



- బిక్కనూరి కీర్తన,
5వ తరగతి,
యు.పి.ఎస్., లింగాపూర్,
తొగుట మండలం, మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చిన్న పిల్లల పెద్ద ఆలోచన

ఆ గ్రామం నగరానికి చాలా దూరంలో ఉంది. అక్కడ ఉన్న పాఠశాల మౌలిక వసతుల లేమితో కునారిల్లుతోంది. చీకటి గదిలో చదువుకోలేక ఆరుబయట వరండాలో చదువుకోవడం, తాగు నీరు, మరుగుదొడ్లు వంటి కనీససౌకర్యాలు కూడా లేని అలాంటిచోట 8వ తరగతి చదువుతున్న విద్యార్థులంతా ఏకమై అతిపెద్ద గ్రామ సమస్యని పరిష్కరించారు. ఎలాగో చూద్దాం.

అరకొర వసతులతో.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబాల నుంచి వచ్చిన ఆ పిల్లలు తమ కోసం స్కూల్లో ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఊరి బాగు కోసం ఎలా ఉపయోగించారో తెలుసుకుంటే ఆశ్చర్యపోతాం. సాంకేతికతను ఉపయోగించుకుని ఎలా అభివృద్ధి చెందవచ్చో నిరూపించిన ఈ పిల్లలు మహారాష్ట్ర నాందేడ్ గ్రామ నివాసులు.

ఈ ఏడాది ఎండలు బాగా మండిపోయాయి. 50 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రతలు



నమోదయ్యాయి. నాందేడ్ కూడా వేసవి తాపానికి గురైంది. ఎండల కంటే ముందు ఆ గ్రామవాసులకు ముంచుకొంచే వర్షాలు, వరదలు, పంటనష్టం, ఆర్థికంగా దెబ్బతినడం వంటి విషయాలు కంటిమీద కునుకులేకుండా చేశాయి. ఆ పరిస్థితిని మార్చడంలోనే నాందేడ్ గ్రామ జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు కృషి చేశారు.

ఏం చేశారు? ఎలా చేశారు?

జూన్‌లో స్కూళ్లు తెరవగానే అందరిలాగే ఈ పిల్లలూ స్కూలుకు వెళ్లారు. అప్పుడే మౌలిక వసతుల లేమితో ఇబ్బందిపడుతున్న స్కూల్లో కంప్యూటర్ ల్యాబ్, సెన్సార్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనతో ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. రాస్ప బెర్రీపై, పై జామ్ ఫౌండేషన్ సాయంతో అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ (ఎఎఫ్ఇ) ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ఫిజికల్ కంప్యూటింగ్ సెన్సార్‌లతో అమర్చారు. కంప్యూటర్ సైన్స్‌లో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించారు. అవసరమైన సాంకేతిక సాధనాలు సమకూర్చారు. తరగతి గదిలో నేర్చుకున్న ఆ పాఠాలను తమ కుటుంబాలకు ఎలా పనికొస్తాయోనని ఆలోచించారు ఈ పిల్లలు. తమ ప్రాంతాన్ని అల్లకల్లోలం చేస్తున్న వాతావరణ ప్రతికూలతలను ఎలా అంచనా వేయవచ్చో పరిశీలించారు.

వాతావరణ కేంద్రం ఇలా మొదలైంది..

వాతావరణ కేంద్రం ఏర్పాటులో అత్యంత కీలకమైన విషయం పిల్లల సృజనాత్మకత. తమ ప్రాంతంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వారు సమస్యగా చూడలేదు. సవాలుగా స్వీకరించారు. టీచర్లు చెప్పిన సైన్సు పాఠాలను ల్యాబ్‌లో పరీక్షించారు. ఉష్ణోగ్రత, పీడనం, తేమ, గాలి వేగం శాస్త్రీయ సూత్రాలను పరిశోధనల్లో పెట్టారు.

'ఒకసారి నేను మా ఇంటి ముందు ఆడుకుంటున్నాను. పక్కింటి ఆంటీ మా అమ్మతో ఏడుస్తూ మాట్లాడుతోంది. అధిక వర్షాల వల్ల తమ పంట అంతా పోయిందని.. చాలా నష్టపోయామని ఆమె చెప్పడం నేను విన్నాను. ఆమె సంతోషంగా ఉండాలని నేను బలంగా కోరుకున్నాను. అందుకు ఏం చేయాలో అప్పటికి తెలియదు. ఇప్పుడు వాతావరణ కేంద్రం ఏర్పాటుచేసి, అననుకూల పరిస్థితులను అంచనా వేశాం. రైతులను అప్రమత్తం చేశాం' అని ఉత్సాహంగా చెబుతోంది




చైత్రాలి


హర్షవర్ధన్


రాజశ్రీ

రాజశ్రీ. 'ఈ ఏడాది మా వాతావరణ కేంద్ర సూచనల వల్ల రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తమయ్యారు. చిన్నపిల్లలైనా చాలా పెద్ద సమస్యను పరిష్కరించారని ఆ రోజు అమ్మ దగ్గర కన్నీరు పెట్టుకున్న ఆంటీ నాతో అంటున్నప్పుడు నాకు చాలా చాలా సంతోషం వేసింది' అంటోంది.

'ఒక రైతు పొలంలో పంట వేసినప్పుడు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాడు. కానీ, వాన ఎప్పుడు వస్తుందో.. ఎండ ఎప్పుడు కాస్తుందో తెలియక చాలా ఆందోళన పడతాడు. అప్పుడే మేము అనుకున్నాం.. వాతావరణ కేంద్రం ద్వారా వారికి సమాచారం అందించాలని. కాని మాలాంటి గ్రామంలో అది సాధ్యమా? అనిపించింది. ఇప్పుడు స్కూల్లో ల్యాబ్ నుంచి ఈ కేంద్రాన్ని నిర్వహిస్తూ రైతులకు సాయం చేస్తుంటే చాలా సంతోషమేస్తోంది' అంటాడు హర్షవర్ధన్.

'మేము చిన్నవాళ్లమే.. కాని సాధించాం. మా ప్రాంతంలో వాతావరణ కేంద్రం స్థాపించాలన్న ఆలోచన రాగానే ముందుగా పూణె వాతావరణ కేంద్ర నిర్వహణను పరిశీలించాం. అది చూశాక మా సమస్య పరిష్కారం కనిపించింది. వాతావరణ కేంద్రం నిర్వహించాలంటే చాలా సెన్సార్లు అమర్చాలి. ఫ్యాను లాగా అమర్చిన సెన్సార్ల ద్వారా గాలి వేగం, పీడనం అంచనా వేయవచ్చు. సెన్సార్లకు అమర్చిన మరో పరికరం ద్వారా గాలి దిశను కూడా తెలుసుకుంటున్నాం' అంటుంది చైత్రాలి.

తమ పరిసరాల్లో సమస్యలను గుర్తించడం.. దానికి పరిష్కారం కనుగొనడంలో ఈ చిన్నారులు కనబర్చిన నైపుణ్యం భావితరాలకు గొప్ప మార్గదర్శకం. రైతన్నల గురించి, వారి బాగు గురించి ఇంతలా పరితపించిన ఈ చిన్నారులు ఎందరినో ఆకర్షిస్తున్నారనడంలో ఆశ్చర్యం లేదు.



ఫైబర్ మెండు

తాటికాయలు బాగా పండి కిందపడినప్పుడు వాటిటెంకల నుంచి భూమిలో పెరిగే తేగలు చాలా రుచిగా ఉంటాయి. ఎటువంటి రసాయనాలు వేయకుండా పండే ఈ తేగలను కాల్చీ లేదా ఉడకబెట్టుకుని తినొచ్చు. ప్రకృతిలో సహజసిద్ధంగా పెరిగే ఇవి ఈ కాలంలో విరివిగా దొరుకుతాయి.


- వీటిలో కొవ్వు శాతం చాలా తక్కువ. రక్తంలో ఉండే కొవ్వు పదార్థాలను తగ్గిస్తుంది. గుండెజబ్బులు, కాలేయ సమస్యలు తగ్గుతాయి. క్యాన్సర్‌ను దూరం చేసుకోవచ్చు.
- తేగల్లో ఆరోగ్య పోషకాలు పుష్కలంగా వున్నాయి. తేగలను బాగా ఉడికించి, వాటిపై మిరియాలు, ఉప్పు రాసుకుని తీసుకుంటే జలుబు, దగ్గు రాకుండా ఉంటాయి.
- నేలలోపల పెరుగే ఈ తేగల్లో నేలలో ఉండే సూక్ష్మధాతువులు వీటిలో ఉండి శరీరానికి మేలు చేస్తాయి. కాబట్టి వీటిని ప్రతిఒక్కరూ తినొచ్చు. వీటిని నమలడం వల్ల నోటి దుర్వాసన తొలగిపోతుంది.
- ఫైబర్ అధికంగా ఉంటుంది. 60 శాతం పిండిపదార్థంతో పాటు పీచు ఉంటుంది. దాంతో ఆహారం త్వరగా జీర్ణమవుతంది. మలబద్ధక, జీర్ణవ్యవస్థ సమస్యలు తొలగిపోతాయి.
- ఈ పిండి పదార్థం రక్తంలో చెక్కర నిల్వలను నియంత్రిస్తుంది. మధుమేహం ఉన్నవారు వీటిని ప్రతిరోజూ తినొచ్చు.
- ఇవి పిల్లల ఎముకల ఎముకల ఎదుగుదలకు దోహదపడతాయి. రక్తవృద్ధికి సహాయపడుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఆహారం.

నాలుగు రాష్ట్రాలతో చర్చలు

'పోలవరం'పై కేంద్రానికి సుప్రీం ఆదేశం ● ఫిబ్రవరి 15 కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు వివాద పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టుపై మూడు రాష్ట్రాలతో పాటు రే లా స్వచ్ఛంద సంస్థ, పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ ఎఎస్ ఓకా, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా వివాదంపై పూర్తి స్థాయి నివేదికను రెండు నెలల్లో సమర్పించాలని ఆదేశించింది. సమస్యలు పరిష్కారానికి రాష్ట్రాల మధ్య చర్చలు నిర్వహించారా అని ప్రశ్నించిన ధర్మాసనం ఆ దిశలో చర్యలు తీసుకోవాలని పేర్కొంది. దీనిపై స్పందించిన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఏకాభిప్రాయం కుదురుతుందో, లేదో తెలుసుకోవడానికి సంబంధిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించేందుకు చొరవ తీసుకుంటామని కోర్టుకు తెలిపింది.



తొలుత కేంద్ర ప్రభుత్వం తరపున న్యాయవాది వసీం ఖాద్రీ వాదనలు వినిపిస్తూ సెప్టెంబర్ 6న సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం భాగస్వామ్య రాష్ట్రాల మధ్య మూడు సమావేశాలు జరిగాయని, సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) కూడా తన నివేదికను జలశక్తి మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. స్టేటస్ రిపోర్టును దాఖలు చేసేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు.

ఒరిస్సా తరపు న్యాయవాది అరుణ్ కట్పాలియా వాదనలు వినిపిస్తూ సెప్టెంబర్‌లో సంబంధిత రాష్ట్రాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారని, అక్టోబర్ నుండి ఎటువంటి పురోగతి లేదని వివరించారు. అప్పటి నుంచి ఎలాంటి సమావేశం జరగలేదని, ముఖ్యమంత్రులతో సమావేశం షెడ్యూల్ చేయలేదని అన్నారు. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ ఈ ఏడాది భారీ వర్షాలు, వరదల సమస్యలను లేవనెత్తారు. దీనివల్ల భారీ నష్టం జరిగిందని అన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొన్ని రక్షణ చర్యలు చేపడితే, పోలవరం నిర్మాణానికి ఏమీ అభ్యంతరం లేదని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ తరపు న్యాయవాది కూడా సమావేశంలో ఒరిస్సా లేవనెత్తిన అభ్యంతరాలనే తామూ కూడా లేవనెత్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ తరపు న్యాయవాది జయదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ పోలవరం నిర్మాణం ఆపవల్సిన అవసరం లేదని, మధ్యవర్తిత్వం జరిగితే సరిపోతుందని తెలిపారు.

టార్గెట్లు పూర్తిచేయని కార్యదర్శులపై ఒత్తిడులు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు అబ్దుల్ రజాక్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మునిసిపాలిటీ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులను ఉన్నతాధికారులు తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆంధ్రపదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు షేక్ అబ్దుల్ రజాక్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాజాగా విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శి బి.చంద్రమోహన్ అధికారులు ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుతో మరణించారని పేర్కొన్నారు. ఇటీవల కడప జిల్లాలో ఒక వార్డు శానిటేషన్, పర్యావరణ కార్యదర్శి కూడా మృతి చెందారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, చంద్రమోహన్ కుటుంబాన్ని ఆదుకోవాలని రజాక్ విజ్ఞప్తి చేశారు.

'వారాహి' ట్రయల్ రన్‌ను పరిశీలించిన పవన్‌కల్యాణ్

జనసేన అధ్యక్షుడు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న యాత్రకు ప్రత్యేక వాహనం సిద్ధమవుతోంది. ఈ వాహనం ట్రయల్‌రన్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ బుధవారం హైదరాబాద్‌లో పరిశీలించారు. ఈ వాహనానికి "వారాహి" రెడీ ఫర్ ఎలక్షన్ బ్యాటిల్" అని పేరు పెట్టినట్లు పవన్‌కల్యాణ్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. దుర్గాదేవి సప్త మాతృకల్లో వారాహి ఒకరని, అందుకే ఈ ప్రచార వాహనానికి వారాహి అమ్మవారి పేరు పెట్టారని పేర్కొన్నారు.



ప్రజాకళలు కష్టజీవుల బాధలు తెలియజేస్తాయి

- ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు
- అలరించిన ఆట..పాట

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ నేపథ్యంలో బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన దేశభక్తి గీతాలు, ప్రదర్శించిన కళా రూపాలు అందరినీ అలరించాయి. మహాసభ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆట పాట వేదికపై ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూలీల ఆటా.. పాట ప్రజల కష్టాలను ప్రతిబింబింపజేస్తాయని తెలిపారు. కష్టజీవుల శ్రమను విద్యార్థి దశలోనే గుర్తించాలన్నారు. సంపద సృష్టికర్తలు శ్రామికులేనని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ నెల 8న జంగారెడ్డిగూడెంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. జంగారెడ్డిగూడెంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, బోడేపూడి సుందరయ్య స్మారక ట్రస్ట్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'వ్యవసాయ రంగంలో శ్రామికుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ గౌరవాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో 80 శాతం శ్రామికుల పాత్ర ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, పూర్వ నాయకులు మంతెన సీతారాం, ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



సంక్రాంతికి 'వాల్తేరు వీరయ్య'

మెగాస్టార్ చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే టైటిల్ టీజర్, బాస్ పార్టీ సాంగ్ సోషల్ మీడియాలో మేకర్స్ విడుదల చేశారు. ఇప్పుడు సినిమా విడుదల తేదీని ప్రకటించారు. 2023 సంక్రాంతి కానుకగా జనవరి 13న ఈ సినిమా విడుదల కానుంది. ఆరోజు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతుందంటూ చిరంజీవి పోస్టర్ ఒకటి విడుదల చేశారు. ఈ చిత్రంలో రవితేజ కీలకపాత్రలో నటిస్తున్నాడు. దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు.



టాప్ వన్‌లో ధనుష్

ప్రతి ఏడాది ప్రఖ్యాత వెబ్ సైట్ ఐఎండీబీ టాప్ -10 సెలబ్రిటీల జాబితాని అనవాయితీగా ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా అత్యధిక పాపులారిటీని..క్రేజ్‌ని ఆధారంగా చేసుకుని ఈ జాబితాని వెల్లడిస్తుంది. తాజాగా 2022 ఏడాదికి సంబంధించిన సెలబ్రిటీల జాబితాని ప్రకటించింది. ఇండియా నుంచి హాలీవుడ్‌లో నటించిన స్టార్ కావడంతో ఐఎండీబీ ధనుష్‌కి అగ్రతాంబూలం ఇచ్చింది. 'గంగూబాయి కతియావాడి' లాంటి విజయంతో ఇండస్ట్రీ అలియాకి సెకెండ్ ప్లేస్ కల్పించారు. ర్యాకింగ్స్‌లో చరణ్ నాల్గవ స్థానంలో ఉండగా... సమంత ఐదవ స్థానంలో ఎన్టీఆర్‌కు 8వ స్థానాన్ని దక్కించుకున్నారు. అలాగే బన్నీ తొమ్మిదవ స్థానంలో ఉన్నారు. కేజీఎఫ్‌తో ఇండియాని షేక్ చేసిన యశ్ 10వ స్థానంలో ఉన్నారు. ఇక చరణ్...ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్‌తో ఇండియా సహా హాలీవుడ్‌ని షేక్ చేసిన సంగతి తెలిసిందే.1100 కోట్ల వసూళ్లతో భారత్‌లో మూడవ భారీ వసూళ్ల చిత్రంగా నిలిచింది. అలాగే పొన్నియన్ సెల్వన్ తో ఫామ్ లోకి వచ్చిన ఐశ్వర్యా రాయ్ బచ్చన్ కి3వ స్థానం దక్కడం విశేషం.

రామోస్ హ్యాట్రిక్

- స్విట్జర్లాండ్‌పై 6-1తో పోర్చుగల్ గెలుపు
- ముగిసిన ప్రి క్వార్టర్స్ పోటీలు
- ఫిఫా ప్రపంచకప్

దోహా: ఫిఫా ప్రపంచకప్-2022 ప్రి క్వార్టర్‌ఫైనల్లో పోర్చుగల్ జట్టు ఘన విజయం సాధించింది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ప్రి క్వార్టర్స్ ఆఖరి మ్యాచ్‌లో పోర్చుగల్ జట్టు 6-1గోల్స్ తేడాతో స్విట్జర్లాండ్‌ను ఓడించింది. పోర్చుగల్ తరపున రామోస్ హ్యాట్రిక్ గోల్స్ కొట్టగా.. పెపె(33వ ని.), రాఫెల్(55వ ని.), లియో (90+2వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. ఇక స్విట్జర్లాండ్ తరపున ఏకైక గోల్‌ను మాన్యుయోల్(58వ ని.)లో చేశాడు. పోర్చుగల్ జట్టు తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 2-0 ఆధిక్యతలో నిలవగా.. రెండో అర్ధభాగంలో ఏకంగా నాలుగు గోల్స్ కొట్టింది. ఈ మ్యాచ్‌కు పోర్చుగల్ స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో బెంచ్‌కే పరిమితం కావడం విశేషం.

క్వార్టర్స్ బెర్త్‌లు ఖరారు..

పోర్చుగల్-స్విట్జర్లాండ్ జట్ల మధ్య మంగళవారం అర్ధరాత్రి జరిగిన మ్యాచ్‌తో ప్రి క్వార్టర్స్ పోటీలు ముగిసాయి. 3వ తేదీ శనివారంతో గ్రూప్ దశ లీగ్ పోటీలు ముగియగా.. 6న పోర్చుగల్- స్విట్జర్లాండ్ జట్ల



మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రి క్వార్టర్స్ పోటీలు ముగిసాయి. ప్రి క్వార్టర్స్‌కు మొత్తం 16జట్లు అర్హత సాధించగా.. ఇందులో 2జట్లు ఆసియా ఖండాని చెందిన జట్లు ఉన్నాయి. జపాన్ జట్టు పెనాల్టీ షూటౌట్‌లో క్రొయేషియా చేతిలో, దక్షిణ కొరియా జట్టు బ్రెజిల్ చేతిలో 4-1తో ఓటమిని చవిచూశాయి. శుక్రవారంనుంచి క్వార్టర్‌ఫైనల్ పోటీలు ప్రారంభం కానున్నాయి.

క్వార్టర్‌ఫైనల్లో ఎవరు ఎవరితో..	
9(శుక్ర) :	క్రొయేషియా × బ్రెజిల్(రా. 8.30గం॥లకు)
	నెదర్లాండ్స్ × అర్జెంటీనా(రా. 12.30గం॥లకు)
10(శని):	మొరాకో × పోర్చుగల్(రా. 8.30గం॥లకు)
	ఇంగ్లండ్ × ఫ్రాన్స్(రా. 12.30గం॥లకు)

పోరాడి ఓడిన టీమిండియా

- మెహిదీ హసన్ సెంచరీ
- కేఎల్ రాహుల్, అక్షర్ అర్ధసెంచరీలు
- రోహిత్ విధ్వస ఇన్నింగ్స్ వృథా
- వన్డే సిరీస్ బంగ్లాదేశ్ కైవసం

ఢాకా: రెండో వన్డేలోనూ టీమిండియా ఓటమిపాలైంది. 272 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఐదు పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. బొటనవేలి గాయంతో చివర్లో బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ రోహిత్ శర్మ వీరోచిత పోరాటం మ్యాచ్‌ను గెలిపించలేకపోయింది. రోహిత్ శర్మ 28బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 51 పరుగులు చేశాడు. విజయానికి 6బంతుల్లో 20 పరుగులు చేయాల్సి దశలో.. ముస్తాఫిజుర్ రెహ్మాన్ వేసిన ఓవర్లో రోహిత్ 2ఫోర్లు, ఒక సిక్స్ కొట్టి ఆశలు రేపాడు. కానీ చివరి బంతికి సిక్స్ కొడితే గెలుస్తుందన్న దశలో ముస్తాఫిజుర్ యార్కర్ వేయడంతో ఒక్క పరుగూ రాలేదు. దీంతో టీమిండియా స్కోరు 266 పరుగుల వద్ద నిలిచి పోయింది. తొలుత రోహిత్ శర్మ గాయపడడంతో విరాట్ కోహ్లీ(5) ఓపెనర్‌గా బరిలో దిగాడు. మరో ఓపెనర్ శిఖర్ ధావన్(8) సైతం విఫలం కావడం తో 13


మెహదీ హసన్ (100నాటౌట్)

పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. సుందర్ 11, కేఎల్ రాహుల్ 14 పరుగులకే వెను దిరగడంతో టీమిండియాకు కష్టాలు ప్రారంభమ య్యాయి. శ్రేయస్ అయ్యర్ 6ఫోర్లు, 3సిక్సర్లతో 82పరుగులు, అక్షర్ పటేల్(56) అర్ధసెంచరీతో రాణించడంతో టీమిండియా ఛేదనకు చేరువైంది. అంతకుముందు బంగ్లాకూ శుభారంభం దక్కలేదు. 69పరుగులకే 6వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో మెహిదీ హసన్(100నాటౌట్) సెంచరీకి తోడు, మహ్మదుల్లా(77) 7వ వికెట్‌కు 148పరుగులు జతచేశారు. సుందర్‌కు మూడు, శార్దూల్, ఉమ్రన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. దీంతో బంగ్లా జట్టు 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68